PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 155 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 01 జూన్ 2026

## బీఎస్పీ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం




## 30 నెలలుగా బిల్లులు పెండింగ్




# తీవ్ర విషాదం..

### - మంజీరా నదిలో మునిగి బావ, బావమరిది మృతి



**హైదరాబాద్ ,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలో ఆదివారం ఉదయం ఒక తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు మంజీరా నదిలో మునిగి బావ, బావమరిది ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. మండల కేంద్రానికి చెందిన గంగొండ (43), ఆయన బావ అయిన రెంజల్ మండలం బోర్గం గ్రామానికి చెందిన గంగారం (50), గంగొండ చిన్న కుమారుడు సంతోష్‌తో మిగతా2లో...

# తుంగభద్ర తీరం.. కన్నీటి సంద్రం

**బాలుడిని రక్షించబోయి ప్రవాహంలో నలుగురు గల్లంతు**

**నదిలో గాలింపు.. మరో నాలుగు మృతదేహాలు వెలికితీత**

**ఎమ్మిగనూర్ దవాఖానలో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి**

**భౌతికకాయాలు కుటుంబసభ్యులకు అప్పగింత**



**అయిజ,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా మంత్రాలయంలో సత్యనారాయణస్వామి వ్రతానికి వచ్చి సమీపంలోని తుంగభద్రా నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు గల్లంతయిన ఘటన శనివారం చోటుచేసుకొన్నది. ఐదేళ్ల బాలుడిని రక్షించబోయి నదీ ప్రవాహంలో మరో నలుగురు మిగతా2లో...



## రాష్ట్ర రాజకీయాలు, పార్టీ తీరు తెన్నులపై చర్చ

### - ఖర్గేతో సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతల భేటీ

**హైదరాబాద్,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో పాలన ఎలా సాగుతుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరా తీశారు. హైదరాబాద్ మీదుగా గుల్బర్గా వెళ్తూ.. శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ఖర్గే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మిగతా2లో...

# జావీద్ కుటుంబానికి అండగా ఉంటాం

**సంతాప సభలో మంత్రులు తుమ్మల, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజహరుద్దీన్,**

**పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎంపీ రఘురాం రెడ్డి**



**ఖమ్మం,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ జావీద్ అందించిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎంపీ రఘురాం రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఖమ్మం నగర కమిటీ మాజీ అధ్యక్షులు మహమ్మద్ జావీద్ సంతాప సభను ఖమ్మం వైఎస్సార్ నగర్ సమీపంలోని రెడ్ హిల్స్ లోని జావీద్ స్వగృహంలో నిర్వహించారు. ఈ సభకు వారంతా హాజరై నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. రాజకీయాల్లో నైతిక విలువలు పాటించిన మిగతా2లో...



## అది రైతుల మెడకు ఉరిపెట్టే డిస్కం : కేటీఆర్

**హైదరాబాద్ ,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతు డిస్కం పేరుతో సిఎం కొత్త నాటకం ఆడుతున్నారని, అది రైతుల మెడకు ఉరిపెట్టే డిస్కం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆదివారం జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో సాగుకు రోజుకు 3 గంటల మిగతా2లో...

# చాంపియన్ వన్స్‌మోర్

**● వరుసగా రెండో టైటిల్ సొంతం ● ఫైనల్లో గుజరాత్‌పై ఘనవిజయం ● అదరగొట్టిన విరాట్ కోహ్లీ**






అహో.. బెంగళూరు. సుదీర్ఘ నిరీక్షణకు తెర దించి గతేడాది తొలి ఐపీఎల్ కప్‌ను ముద్దాడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నుంచి మరో అ'ద్వితీయ' షో. గుజరాత్ టైటాన్స్‌తో ఫైనల్‌కు ముందు సమవుజ్జీల పోరుగా భావించినా.. తాము బరిలోకి దిగితే వార్ వన్‌సైడే అని రజత్ సేన నిరూపించింది. ఆర్‌సీబీ బౌలర్ల ధాటికి అతికష్టంగా 150 పరుగులు దాటిన టైటాన్స్‌కు ఫలితమేంటో ముందే తెలిసొచ్చింది. అనంతరం ఛేజింగ్ రారాజు విరాట్ కోహ్లీ అజేయ హాఫ్ సెంచరీతో కడదాకా నిలిచి, బెంగళూరు వరుసగా రెండోసారి కప్‌ను ముద్దాడేలా చేశా డు. అటు బెంగళూరు ఫ్యాన్స్ 'ఈ సాలనూ కప్ నమ్దే' అంటూ విజయ సంబరాలతో మైమరిచి పోయారు. ఇక క్వాలిఫయర్2లో చూపిన పోరాట పటిమను సొంత గడ్డపై పునరావృతం చేయలేక గిల్ సేన నిరాశలో మునిగింది.



## బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభిస్తాం

**● ఉచిత బస్సు ప్రయాణంతో గ్రామీణ ప్రాంతాల్లో బస్సులకు డిమాండ్ ● ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి పొన్నం ప్రభాకర్ ● మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పెద్దపల్లి బస్‌డిపో స్థల పరిశీలన**

**పెద్దపల్లి,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్టీసీ బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్‌డిపో మిగతా2లో...

# సంక్షేమంలో సింగరేణి సరికొత్త అధ్యాయం

**కార్మిక కుటుంబాలకు రక్షణ కవచం రూ. కోటి ప్రమాద బీమా**

**సహజ మరణానికి రూ.10 నుంచి రూ.15 లక్షలు**

**ఇప్పటి వరకు 45 కుటుంబాలకు రూ.41 కోట్ల సొమ్ము చెల్లింపు**




**హైదరాబాద్ ,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌-సీసీఎల్) కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద బీమా పథకాలను అమలు చేస్తోంది. కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి కుటుంబాలకు రూ. 1.25 కోట్ల వరకు బీమా అందుతోంది. అలాగే సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు ఎలాంటి ప్రీమియం లేకుండా రూ.10 నుంచి రూ.15 లక్షల ఉచిత బీమాను కూడా కల్పిస్తున్నారు. ఈ సదుపాయం కోసం కార్మికులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, వారి కుటుంబాలకు సైతం రూ. 30 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని సంస్థ అమలు చేస్తోంది. ప్రమాదాల వల్ల కుటుంబ మిగతా2లో...

# టార్గెట్ తెలంగాణ!

**2029 అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీల కసరత్తు**

**టీడీపీ, జనసేనకు రాష్ట్రంలో చోటు కల్పించేందుకు బీజేపీ యత్నం**

**టీడీపీ కేడర్ తనవెంటే ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాలు**

**దానిలో భాగమే అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ**

**రేపు హైదరాబాద్‌లో పవన్‌కళ్యాణ్ జనసాదక్ సమ్మేళనం**

**జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీకోసం సన్నద్ధం**




**హైదరాబాద్ ,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో 2029 ఎన్నికల కోసం రాజకీయ వ్యూహాలు ఇప్పటి నుంచే ప్రారంభమయ్యాయి. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని బీజేపీ తీవ్రంగానే ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే ఒంటరిగా తాము అధికారంలోకి రాలేమనే విషయం ఆపార్టీ అధినేతలకు స్పష్టంగా తెలుసు. పొరుగు రాష్ట్రం మిగతా2లో...




## అమెరికాతో రాజీ పడే ప్రసక్తే లేదు

**● ఇరాన్ స్పష్టీకరణ ● ప్రముఖ మేధోసంస్థ ఐసీడబ్ల్యూసీటీపీ వెల్లడి ● ఒప్పందానికి చేరువగా ఉన్నాం.. చర్చలు విఫలమైతే సైనిక చర్య తప్పదు : ట్రంప్**

# చాంపియన్ వన్స్‌మోర్

**అహ్మదాబాద్:మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఐపీఎల్-19వ సీజన్‌లోనూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఏకపక్ష ఫైనల్లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 75 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆర్సీబీకిది వరుసగా రెండో టైటిల్ కాగా.. అటు 2022లో తొలిసారి విజేతగా నిలిచిన గుజరాత్ ఫైనల్లో ఓడడం ఇది రెండోసారి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. సుందర్ (37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్), నిశాంత్ (18 బంతుల్లో 3 ఫోర్లతో 20), బట్లర్ (23 బంతుల్లో 1 ఫోర్‌తో 19) మాత్రమే రాణించారు. రసిఖ్‌కు మూడు.. భువనేశ్వర్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 18 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), డేవిడ్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) వేగం చూపారు. రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా విరాట్ కోహ్లీ, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా వైభవ్ సూర్యవంశీ నిలిచారు.

# సంక్షేమంలో సింగరేణి సరికొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

పెద్దను కోల్పోయి ఆర్థికంగా కుంగిపోయి ఛిన్నాభిన్నం అయ్యే పరిస్థితుల్లో చిక్కుకున్న జీవితాలకు సంస్థ అందిస్తున్న బీమా భరోసాగా నిలుస్తోంది. 2024లో ప్రారంభమైన ఈ పథకం నేడు దేశవ్యాప్తంగా బీమా రంగంలో ఒక విప్లవాత్మక చేయూతగా మారింది.**పలు బ్యాంకులతో ఒప్పందం** కార్మికుల ప్రమాద బీమా అమలుకు సింగరేణి సంస్థ పలు బ్యాంకులతో ఒప్పందం చేసుకుంది. కార్పొరేట్ శాలరీ అకౌంట్స్ కలిగి ఉన్న కార్మికులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులు ప్రమాద బీమా పథకం కింద 1.25 కోట్ల రూపాయలను చెల్లించడానికి సింగరేణితో ఒప్పందం చేసుకొని అమలు చేస్తున్నాయి. సంస్థలో పనిచేస్తున్న 40,275 మంది ఉద్యోగులకు ఈ బీమా వర్తిస్తోంది. సింగరేణి ఉద్యోగులు వ్యక్తిగతంగా పలు ప్రమాద బీమా పథకాలలో సభ్యులుగా ఉన్నప్పటికీ ఆ పథకాల కింద నిబంధనల ప్రకారం ఎంతో కొంత సొమ్మును ఇన్సూరెన్స్ కింద చెల్లిస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సింగరేణిలో పలు బ్యాంకులు అమలు జరుపుతున్న ప్రమాద బీమా పథకానికి ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా ఒప్పందం జరిగింది. దీనిపై కార్మికులు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా..** సింగరేణి ఉద్యోగులు ఎవరైనా అనుకోని ప్రమాదాల లో మృతి చెంది నప్పుడు వారి కుటుం బాలు తీవ్రమైన మానసిక వేదనతో పాటు, ఆర్థిక ఇబ్బందు లను కూడా ఎదుర్కో వాల్సి వస్తుంది. ఇటువంటి సమయంలో ప్రమాద బీమా పథకం వారికి అండగా ఉంటోంది. ఉచిత ప్రమాద బీమా పథకం కింద రెండేండ్ల కాలంలో వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 32 మందికి రూ.28 కోట్లు చెల్లించడం జరిగింది. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా 13 మందికి రూ.13 కోట్లను చెల్లించడం జరిగింది. సాధారణం గా ఇటువంటి బీమా పథకంలో చేరాలంటే ప్రీమియం అమౌంట్ గా ఎంతో కొంత చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పని చేస్తున్న ప్రదేశాలు, వయస్సును బట్టి పెద్ద మొత్తంలో ప్రీమియం కూడా చెల్లించాల్సి ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ ఫలితంగా ఎటువంటి ప్రీమియం చెల్లింపు లేకుండానే ఉచితంగా ఈ 10 లక్షల రూపాయల సహజ మరణ బీమా పథకాన్ని కూడా బ్యాంకులు అమలు జరుపుతున్నాయి. పొరుగు సేవల సిబ్బందికీ రూ.40 లక్షల ప్రమాద బీమా అంద జేస్తున్నారు. సింగరేణిలో దాదాపు 30 వేల మంది పొరుగు సేవల సిబ్బంది పనిచేస్తు న్నారు. అలాగే విశ్రాంత సింగరేణి ఉద్యోగు లకూ కూడా ఉచిత ప్రమాద బీమా అందిస్తున్నారు.**రెండు కుటుంబాలకు చెక్కుల అందజేత** ప్రమాదంలో మృతి చెందిన సింగరేణికి చెందిన రెండు కుటుంబాలకు ఉచిత ప్రమాద బీమా పథకం కింద రూ.1.25 కోట్ల చెక్కులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అదివారం అందజేశారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన 18 నెలలకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంతోష్, అలాగే ప్రమాద వశాత్తు మృతి చెందిన రంజిత్ కుమార్ కుటుంబాలు లబ్ది పొందాయి. సంపాదించే ఇంటి పెద్దలు మరణించడంతో దిక్కులేని స్థితిలో ఉన్న తమకు సంస్థ ప్రారంభించిన ఉచిత బీమా ఎంతగానో ఉపయోగ పడిందని వారు పేర్కొన్నారు.

# బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

స్థలాన్ని ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయరమణారావుతో కలిసి ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయరమణారావు, సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి పెద్దపల్లికి ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేశారని తెలిపారు. బస్ డిపో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్టు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కార్మికులు అనవసర ఆందోళన చెందొద్దని తెలిపారు.

# అమెరికాతో రాజీ పడే ప్రసక్తే లేదు




**టెహ్రాన్/వాషింగ్టన్ ,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** శాంతి ఒప్పందానికి ముందు ఎంఓయూ (అవగాహనా ఒప్పందం) కుదుర్చుకునేందు కు ఇరాన్, అమెరికా తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అయితే ఎంఓయూను ఖరారు చేయడానికే చాలా కాలం పడుతోంది. దీనికి కారణం దానిలోని ప్రతి పదాన్ని విశ్లేషించి, చర్చించాల్సి వస్తోంది. ఒక అంశానికి, మరో అంశానికి మధ్య ఉన్న సంబంధాన్ని నిశితంగా పరిశీలి స్తున్నారు. ఉదాహరణకు ఎంఓయూ కుదిరిన తర్వాత 60 రోజులలోగా తుది ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. అయితే ఈ 60 రోజుల ప్రక్రియను వారాల తరబడి కొనసాగుతున్న కాల్పుల విరమ ణకు పొడిగింపుగా భావిస్తారా లేదా శత్రుత్వానికి ముగింపుగా భావిస్తారా అనేది తెలియడం లేదు. ఎంఓయూను కేవలం ఒకే పేజీలో పొందుపరిచారు. దీనిలో దాదాపు డజను అంశాలు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ అది అంత తేలికగా తేలే విషయంగా కన్పించడం లేదు.**ట్రంప్ తాజా డిమాండ్లతో పరిస్థితి జటిలం** 'వారు ఏయే అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నారో, తొలి దశలో ఏ మేరకు రాయితీలు ఇవ్వడానికి సుము ఖంగా ఉన్నారో స్పష్టంగా తెలియాల్సి ఉంది. అప్పుడే దౌత్య పరి ష్కారం సాధ్యపడుతుంది' అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇటీవల చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణను దీర్ఘకాలిక పరిష్కారంగా మార్చే విష యంపై ఇరుపక్షాలు తాత్కాలికంగా ఒప్పందానికి వచ్చాయని అమెరికా అధికారులు తెలిపారు. అయితే రెండు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక డిమాండ్లను తెర పైకి తీసుకురావడంతో పరిస్థితి జటిలంగా మారింది. హార్ముజ్ జలసంధిని తెరవాలని, ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆయన కోరుతున్నారు. దీనికి ఇరాన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విదేశాలలో స్తంభింపజే సిన తన ఆస్తులను తక్షణమే విడుదల చేయాలని ఇరాన్ పట్టుబడుతుండగా ట్రంప్ దానిపై పెదవి విప్పడం లేదు. అమెరికా డిమాండ్లు వాస్తవానికి అభ్యర్థనలేనని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై వ్యాఖ్యానించారు. ఏదేమైనా ఎంఓయూపై చర్చలు మాత్రం ఇంకా పురోగతిలోనే ఉన్నాయని తెలుస్తోంది.**హార్ముజ్‌పై...**హార్ముజ్ జలసంధిలో మూడు నెలలుగా వాణిజ్య నౌకల రాకపోకలు స్తంభించిపోవడంతో ముడి చమురు, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ముందుగా నౌకాయానంపై ఒప్పందానికి రావాలని ఇరు పక్షాలు భావిస్తున్నాయి. జలసంధిని వెంటనే తెరవాలని, ఎలాంటి సుంకాలు-నియంత్రణలు లేకుండా నౌకాయానాన్ని అనుమతించాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. జలసంధిలో అమర్చిన మందుపాతరలను తొలగించాల్సిన బాధ్యత ఇరాన్‌దేనని కూడా ఆయన అంటున్నారు. అదే సమయంలో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధాన్ని ఎత్తివేస్తామని చెప్పారు. అయితే ఒమన్‌తో కలిసి అంతర్జాతీయ జలమార్గం మీదుగా నౌకల రాకపోకలను పర్యవేక్షించే హక్కు తనకు ఉన్నదని ఇరాన్ అంటోంది. హార్ముజ్‌లో ఒమన్ ప్రమేయాన్ని వ్యతిరేకించడంతో పాటు దానికి ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. హార్ముజ్‌లో ఇరాన్ నియంత్రణలు, ఏర్పాట్లు స్వభావరీత్యా శాశ్వతమైననవి, అవి తాత్కాలికమైనవేమీ కావని పార్లమెంటుకు చెందిన జాతీయ భద్రతా కమిషన్ అధిపతి ఇబ్రహిం అజిజి స్పష్టం చేశారు.**హార్ముజ్‌ను తెరిస్తేనే ఆర్థిక డిమాండ్ల పరిష్కారం** విదేశాలలోని బ్యాంకులలో ఉన్న అనేక బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను అమెరికా స్తంభింపజేసిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని టెహ్రాన్ డిమాండ్ చేస్తోంది. అయితే హార్ముజ్‌ను ఇరాన్ తిరిగి తెరిచినప్పుడే ఇది జరుగుతుందని అమెరికా సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. 'తదుపరి నోటీసు జారీ అయ్యే వరకూ నగదు బదిలీ జరగదు' అని ట్రంప్ కూడా తెలిపారు. ఎంఓయూకు రెండు దేశాలు అంగీకరిస్తే 24 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఇరాన్ ఆస్తులను అమెరికా విడుదల చేయాల్సి ఉంటుంది. తుది ఒప్పందం కుదిరిన తర్వాత ఇరాన్ పునర్నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి నిధిపై కూడా చర్చలు జరుగు తున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల కారణంగా 270 బిలియన్ డాలర్ల మేర నష్టం జరిగిందని ఇరాన్ అధికారులు అంచనా వేశారు. కాగా హార్ముజ్‌ను తిరిగి తెరిచినప్పుడే ఇరాన్‌పై విధించిన ఆంక్షల ఎత్తివేత జరుగుతుందని కూడా అమెరికా చెబుతోంది. తద్వారా టెహ్రాన్ ఆర్థిక డిమాండ్లను హార్ముజ్‌తో ముడిపెట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది.**లెబనాన్‌పై...** ఇరాన్'అమెరికా మధ్య జరుగుతున్న చర్చలలో లెబనాన్ అంశం కూడా ముందుకు వస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు సహా అన్ని వైపుల నుంచి యుద్ధం ఆగిపోవాల్సిందేనని ఇరాన్ పట్టుబడుతోంది. అయితే ఇజ్రాయిల్ దళాలు మాత్రం దక్షిణ లెబనాన్‌లోకి చొచ్చుకుపోతూ విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. అదే సమయంలో హిజ్బొల్లా కూడా ఇజ్రాయిల్ దళాలపై రాకెట్లు, డ్రోన్ల ప్రయోగిస్తోంది.

# తీవ్ర విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఆదివారం ఉదయం గొర్రెలను కడిగేందుకు మంజీరా నదికి వెళ్లారు. అక్కడ నదిలో గొర్రెలను శుభ్రం చేస్తున్న సమయంలో గంగారం ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లి నీటిలో మునిగిపోయారు. గమనించిన గంగొండ తన బావను కాపాడేందుకు తక్షణమే రంగంలోకి దిగి ప్రయత్నించినప్పటికీ, దురదృష్టవశాత్తు ఆయన కూడా నీట మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడంతో గ్రామంలో తీవ్ర శోకసంద్రం నెలకొంది.

# తుంగభద్ర తీరం.. కన్నీటి సంద్రం

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుకుపోగా, ఒకరు సురక్షితంగా బయటపడ్డారు. శనివారం ధనుశ్ మృతదేహం లభ్యంకాగా, ఆదివారం ఏపీ ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టి సతీశ్ (35), యవన్‌చంద్ర (5), సంధ్య (22), రాఘవేంద్ర (25) భౌతికకాయాలను వెలికితీశారు. తహసీల్దార్ రమాదేవి, సీఐ దస్తగిరి పర్యవేక్షించారు. మృతదేహాలను ఎమ్మిగనూర్ దవాఖానకు తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు భౌతికకాయాలను అప్పగించారు. సతీశ్, యవన్‌చంద్ర తండ్రీకొడుకులుకాగా.. కుమారుడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రితోపాటు మరో ముగ్గురు నీటి ప్రవాహంలో మునిగి ప్రాణాలు కోల్పోవడం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

# రాష్ట్ర రాజకీయాలు, పార్టీ తీరు తెన్నులపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు.. ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాల గురించి వాకబు చేశారు., పార్టీ బలోపేతానికి నేతలు కృషి చేయాలని ఈ సందర్భంగా ఖర్గే సూచించినట్టు సమాచారం.

# జావీద్ కుటుంబానికి అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తి జావీద్ అని అన్నారు. జావీద్ ను ఆనాటి బీఆర్ఎస్ పార్టీ ఎంతో ఇబ్బంది పెట్టిందని తెలిపారు. జావీద్ వ్యాపారాల్లో నష్టం వచ్చేలా చేసిందని, అయినా వాటన్నింటిని ధైర్యంగా ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. జూన్ లో జావీద్ కు పదవి రావాల్సి ఉందని, సన్మాన సభ జరగాల్సిన స్థలంలో సంతాప సభ నిర్వహించాల్సి వస్తోందని అనుకోలేదన్నారు. రాజకీయ హామీగా కాకుండా భవిష్యత్ లో జావీద్ కుటుంబానికి, ఆయన అనుచరులకు తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. ఈ సభలో ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర విత్తన గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, కొండబాల కోటేశ్వరరావు, బాలసాని లక్ష్మీ నారాయణ, సుడా చైర్మెన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, సంబాని చంద్రశేఖర్, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, మానుకొండ రాధా కిషోర్, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# అది రైతుల మెడకు ఉరిపెట్టే డిస్కం : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ చాలన్నారని, ఇప్పుడు మాటమార్చి రైతు డిస్కం ఏర్పాటు చేస్తామంటున్నారని అన్నారు. అది రైతు మెడకు ఉరి పెట్టే డిస్కం అని మండిపడ్డారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక సమయంలో స్థానికంగా ఆరు వేల ఇళ్లు కట్టిస్తామన్నారని, ఇప్పటివరకు ఆరు ఇళ్లు అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి 420 హామీలను అమలు చేసి చూపించాలని అన్నారు. కేసీఆర్ అప్పులు చేసి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారని, రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు.

# టార్గెట్ తెలంగాణ!

(మొదటి పేజీ తరువాయి)




ఆంధ్రప్రదేశ్‌లో మిత్ర పక్ష?లుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలకు తెలంగాణలో స్థానం కల్పించేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను పోటీ చేయించి, బలాబలాలు అంచనా వేయాలని వ్యూహరచన చేస్తున్నారు. దానిలో భాగంగానే రాష్ట్రావతరణ రోజైన జూన్ 2వ తేదీ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ-జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో ఓ సభను ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు తనపార్టీ కేడర్‌ను సిద్ధం చేయడమే ఈ సభ ఉద్దేశ్యమని తెలుస్తుంది. మరోవైపు తెలంగాణలో టీడీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని ఇటీవలి మహానాడులో తీర్మానం చేశారు. దానిలో భాగంగా రాష్ష్ణంలో ఆపార్టీ కార్యక్రమాలు పెరుగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌తో పాటు టీడీపీ ఓట్లను కూడా రాబట్టడంలో సక్సెస్ అయ్యి, అధికారాన్ని దక్కించుకున్నారు. అయితే టీడీపీ కేడర్ బీజేపీవైపు మళ్లకుండా తనవెంటే ఉండేలా రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు. ఇటీవల అమీర్‌పేటలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. దాన్ని వ్యతిరేకించిన బీఆర్ఎస్ నేతలపై తీవ్ర విమర్శలే చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీచేయాలనేది వ్యూహంగా కనిపిస్తుంది.అదే సమయంలో టీడీపీ కేడర్‌కు దగ్గరగా ఉంటూనే, ప్రభుత్వ నెగటివ్ ఓట్‌బ్యాంక్‌ను చీల్చడం కోసం తెలంగాణ రక్ష?ణ సమితి (టీఆర్ఎస్)ని వాడుకోవాలనేది రేవంత్‌రెడ్డి వ్యూహంగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న టీడీపీ.. రాష్ట్ర విభజన తర్వాత బలహీనపడింది. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి 15 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే వారంతా బీఆర్ఎస్‌లో చేరడంతో టీడీపీ పూర్తిగా బలహీనపడింది. ఆ ఎన్నికల్లో ఆపార్టీకి 28,28,492 ఓట్లు వచ్చాయి. 2018లో కాంగ్రెస్, వామపక్షాలతో జతకట్టి పోటీ చేసినా బీఆర్ఎస్ ముందు నిలబడలేకపోయింది. అయితే అప్పుడు కూడా టీడీపీకి తెలంగాణలో 7,27,714 ఓట్లు వచ్చాయి. 2023 ఎన్నికల్లో ఆపార్టీ పోటీచేయలేదు. ఆ ఓట్లన్నీ కాంగ్రెస్‌కు మళ్లడంతో రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడంతో తెలంగాణలో కూడా ఆపార్టీలను కాపాడుకోవడం, నిలబెట్టుకోవడంపైనే ఇప్పుడు ఆయా పార్టీల అధినేతలతో పాటు కాంగ్రెస్‌కూడా తాపత్ర యపడుతోంది. ఇక జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తెలంగాణలో పార్టీ నిర్మాణం, జిల్లా స్థాయి కమిటీల బలోపేతం, యువతను ఆకర్షించే కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పార్టీ వైఖరి లాంటి అంశాలపై స్పష్టత ఇవ్వనున్నారు. కొన్నేళ్లుగా టీడీపీ, జనసేన ఏపీ రాజకీయాలకే పరిమితం అయినా, 2024లో ఏపీలో అధికా రంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయి. దీనితో ఇప్పుడు ఆపార్టీల దృష్టి తెలంగాణపై పడింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీచేసి, మేయర్ పీఠాన్ని దక్కించుకుంటే, ఆ ఊపు తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగుతుందనే ధీమా ఆపార్టీల్లో కనిపిస్తుంది. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ కూడా ఆంధ్రాఓటర్ల నాడిని పట్టేందుకు తహతహలాడుతున్నాయి.

# 30 నెలలుగా బిల్లులు పెండింగ్

## తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి

**నడికూడ, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'మన ఊరుమన బడి' పనులకు సంబంధించిన బిల్లులు 30 నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు తెలిపారు. వెంటనే బిల్లులు విడుదల చేసి, ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నడికూడ మండల కేంద్రంలోని జడ్‌పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ హాల్, ఫ్యాన్లు, లైటింగ్ వ్యవస్థ, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే శిథిలావస్థకు చేరుకున్న ఎంపీపీఎస్ పాఠశాల భవనాన్ని గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతులు చేసినట్లు తెలిపారు.మండల ఏర్పాటు తర్వాత ఎంపీడీవో కార్యాలయానికి భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాల భవనాన్ని కార్యాలయానికి కేటాయించారని, అక్కడి విద్యార్థులను జడ్‌పీహెచ్ ఎస్‌కు తరలించారని వివరించారు. దీంతో విద్యార్థులు ఒకే గదిలో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో 'మన ఊరుమన బడి' పథకం కింద కొత్త తరగతి గదులు మంజూరయ్యాయని తెలిపారు.అయితే పనులు చేపట్టిన ఇప్పటివరకు బిల్లులు విడుదల కాకపోవడంతో అప్పులు చేసి వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే చొరవ తీసుకుని పెండింగ్ బిల్లులను విడుదల చేయడంతో పాటు నిలిచిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని కోరారు.జూన్‌లో ప్రారంభమయ్యే కొత్త విద్యా సంవత్సరానికి ముందే నూతన తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, చిన్నారులు ఇరుకు గదుల్లో చదువుకునే పరిస్థితికి ముగింపు పలకాలని రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.


నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు



# బీఎస్పీ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం



**జమ్మికుంట,మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశాన్ని ఆదివారం జమ్మికుంటలో హుజురాబాద్ బీఎస్పీ పార్టీ అసెంబ్లీ అధ్యక్షులు మంద సమ్మయ్య అధ్యక్షతన ఏర్పాటు జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు దొడ్డె సమ్మయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు దొడ్డె సమ్మయ్య మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ (బి.ఎస్.పి) సెక్టార్ కమిటీలు,బూత్ కమిటీల నిర్మాణం కోసం నాయకులందరూ సమిష్టిగా పనిచేయాలని కోరారు.రానున్న ఎంపిటిసి,జెడ్పిటిసి ఎన్నికలలో గ్రామ గ్రామాన గడపగడపకు బీఎస్పీని పరిచయం చేసి ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ లు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), వేల్పుల మల్లేష్, మారముల్ల సాంబయ్య,రాచపల్లి రమేష్,గరిగే చంద్రయ్య, రామ్ శ్రీనివాస్, మొలుగూరి శ్రీనివాస్,బిసి నాయకులు మామిండ్ల మల్లయ్య,దాసరపు ప్రవీణ్, అంబాల అంజి,కోరి రంజిత్,మడిపల్లి చక్రపాణి, హుజురాబాద్ నియోజకవర్గం సోషల్ మీడియా/మీడియా ఇంచార్జ్ మంద జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ వేదిక రోడ్డు భద్రత పోస్టర్ల ఆవిష్కరణ



**పరకాల, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రోడ్డు ప్రమాదాల అవగాహన కార్యక్రమాల పోస్టర్లను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. ప్రయాణాల సమయంలో అప్రమత్తంగా ఉండి, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షులు మడికొండ రఘుపతి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సంస్థ తరపున విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శనిగరపు శ్రీనివాస్, సి.హెచ్. కృష్ణ, ఎస్. సందీప్, సంగు రాజు, మడికొండ ఛత్రపతి, ఏకు అజయ్, బోట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికే రోల్ మోడల్ 'ప్రెస్ క్లబ్' నిర్మించాలి

**- రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ**

**ఖమ్మం ప్రతినిధి, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన 'ఫోర్త్ ఎస్టేట్'ను బలోపేతం చేసే దిశగా ఖమ్మంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన రోల్ మోడల్ ప్రెస్ క్లబ్‌ను నిర్మించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. శరవేగంగా మారుతున్న సాంకేతిక యుగానికి అనుగుణంగా 100 ఇంచుల డిజిటల్ స్క్రీన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సదుపాయాలు, ఆడియో - విజువల్ వ్యవస్థలు, హైటెక్ కమ్యూనికేషన్ పరికరాలతో ప్రెస్ క్లబ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు తమ అభిప్రాయాలు, విధానాలను ప్రజలకు సమర్థవంతంగా తెలియజేసేందుకు ఈ ప్రెస్ క్లబ్‌ను ఒక ప్రజాస్వామ్య వేదికగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్, డిజిటల్, వెబ్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అందరూ వినియోగించుకునే విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం దీనిని దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా నిర్మించి జర్నలిస్టులకు బహుమతిగా అందించాలని అన్నారు.స్థానిక ఎన్ఎస్పీ క్యాంపులో అనేక స్థలాలు ఎందరికో ఇచ్చారని, కొందరు అనర్హులకు కూడా ఇచ్చారని, ఫోర్ పిల్లర్స్ లో ఫోర్త్ పిల్లర్ గా ఉన్న 'ఫోర్త్ ఎస్టేట్' మిగతా మూడు పిల్లర్లకు పారదర్శకత, జవాబు దారితనాన్ని కూడా గుర్తుచేస్తుందని అట్లాంటి 4వ స్తంభమైన 'ఫోర్త్ ఎస్టేట్' కి స్థానిక ఎన్ఎస్పీ క్యాంపులో స్థలాన్ని కేటాయించాలని కోరారు.దేశంలోని మిగతా మూడు స్తంభాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, పదవులు, ఆర్థిక భద్రత, కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నప్పటికీ 'ఫోర్త్ ఎస్టేట్'లో పనిచేస్తున్న పాత్రికేయులు ఇప్పటికీ ప్రైవేట్ సంస్థలపై ఆధారపడి జీవనం సాగించడం విచారకరమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు దాటినా జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, జీవనోపాధి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశం 147వ స్థానానికి చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు.తెలంగాణలో పత్రికా స్వేచ్ఛకు పునర్జీవనం పోసే విధంగా ఖమ్మంలోని ఎన్.ఎస్.పి క్యాంపు ప్రాంతంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించి, 50 లక్షలతో ప్రెస్ క్లబ్ హాలును నిర్మించి స్థానిక పాత్రికేయులకు బహుమతిగా ఇవ్వాలని సాదిక్ అలీ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, సమాచార శాఖామాత్యులు స్థానికంగా ఉండటం ఖమ్మంను జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనుకూల అవకాశమన్నారు. ఈ లక్ష్య సాధన కోసం పాత్రికేయులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.






# టీపీసీసీ డాక్టర్స్ సెల్ జిల్లా చైర్మన్‌గా డా. ఆనందపు రవిబాబు నియామకం







**ములుగు, మల్లంపల్లి మండల ప్రతినిధి మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ములుగు జిల్లా చైర్మన్‌గా డా. ఆనందపు రవిబాబును నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ జారీ చేసిన నియామక ఉత్తర్వులను మంత్రి సీతక్క అధికారికంగా డా. రవిబాబుకు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పార్టీ బలోపేతానికి డా. రవిబాబు విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా వైద్యులను సమన్వయం చేస్తూ ఆరోగ్య రంగంలో ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.నియామక పత్రాన్ని అందుకున్న డా. రవిబాబు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ములుగు జిల్లాలో డాక్టర్స్ సెల్‌ను మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్, మండల సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ట్యాగ్ లైన్:"ప్రజా ఆరోగ్య సేవలే లక్ష్యంగా... టీపీసీసీ డాక్టర్స్ సెల్ ములుగు జిల్లా చైర్మన్‌గా డా. రవిబాబు బాధ్యతలు స్వీకారం".

# త్రిబుల్ ఐటీలో కల్లూరు విద్యార్థుల సత్తా

**ఖమ్మం జిల్లాలో అత్యధిక సీట్లు సాధించిన కల్లూరు మండలం**

**ప్రభుత్వ పాఠశాలల ఆణిముత్యాల అద్భుత ప్రతిభ**


**పేదరికం అడ్డుకాలేదు**

**ప్రతిభతో త్రిబుల్ ఐటీ బాట పట్టిన విద్యార్థులు**

**కల్లూరు, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరని కల్లూరు మండల విద్యార్థులు మరోసారి నిరూపించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బాసర త్రిబుల్ ఐటీ ప్రకటించిన ప్రవేశాల్లో కల్లూరు మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించి సీట్లు పొందడం విశేషం. ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా సీట్లు సాధించిన మండలంగా కల్లూరు ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ఆర్. శివనందిని, ఎస్‌కే. ఫరీదా, కే. జోస్తవిక ఎంపిక కాగా, పీఎం శ్రీ గౌట్ హైస్కూల్ నుంచి మోదుగు రామచరణ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సాయి వెన్నెల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న కొరుకొండి నుంచి ఇంటి త్రిష త్రిబుల్ ఐటీ సీట్లు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఈ విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించడం విశేషం. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా కల్లూరు మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత, ప్రధానోపాధ్యాయులు పద్మ, రమణయ్య, శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజేతలను ఘనంగా అభినందించారు. లక్ష్యం ఉంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో రాణించగలరు అనే సందేశాన్ని ఈ విద్యార్థులు సమాజానికి చాటిచెప్పారు. వారి విజయం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవడంతో పాటు మరెందరో విద్యార్థులను ఉన్నత విద్య వైపు అడుగులు వేయించేలా ప్రేరణ కలిగిస్తోంది.
















PCW తెలుగు దినపత్రిక
సోమవారం 01 జూన్ 2026

# టీజీ పీఈసెట్–2026 పరీక్షలు నేడు ప్రారంభం




**కరీంనగర్ టౌన్ మే31(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని విశ్వవిద్యాలయాలు మరియు అనుబంధ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి బి.పి.ఇడి., డి.పి.ఇడి. కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ శారీరక విద్య ఉమ్మడి ప్రవేశ పరీక్ష (TG PECET`–2026) ఆదివారం నుంచి ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో, శాతవాహన విశ్వవిద్యాలయం ఈ పరీక్షలను నిర్వహిస్తోంది.మే 31 నుంచి జూన్ 3 వరకు శాతవాహన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ప్రతిరోజూ ఉదయం 6.30 గంటల నుంచి శారీరక సామర్థ్య, నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు టీజీ పీఈసెట్ చైర్మన్, వైస్–ఛాన్సలర్ ఆచార్య ఉమేష్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది TG PECET`2026కు మొత్తం 3,305 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, అందులో బి.పి.ఇడి. కోసం 2,342 మంది, డి.పి.ఇడి. కోసం 963 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 1,986 మంది పురుషులు, 1,312 మంది మహిళా అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అందుబాటులో ఉన్న సీట్లలో 15 కళాశాలల్లో 1,560 బి.పి.ఇడి. సీట్లు, 3 కళాశాలల్లో 300 డి.పి.ఇడి. సీట్లు ఉన్నాయి. వీటిలో యూనివర్సిటీ కళాశాలల్లో 200 బి.పి.ఇడి. సీట్లు, హైదరాబాద్ ప్రభుత్వ శారీరక విద్యా కళాశాలలో 60 బి.పి.ఇడి., 200 డి.పి.ఇడి. సీట్లు అందుబాటులో ఉన్నాయి. పరీక్షల షెడ్యూల్ ప్రకారం తొలి రెండు రోజుల్లో రోజుకు 993 మంది పురుష అభ్యర్థులు, మూడో మరియు నాలుగో రోజుల్లో రోజుకు 656 మంది మహిళా అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిస్టారెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పురుషులకు 100 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్/హైజంప్, మహిళలకు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్/హైజంప్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, లాన్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, టీజీ పీఈసెట్–2026 తాత్కాలిక ఫలితాలను జూన్ 6న ప్రకటించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# విద్యాసేవకు విరమణ.. సమాజసేవకు కాదు

- ఆదర్శ ఉపాధ్యాయుడు రాకం శ్యామ్‌కు ఘన వీడ్కోలు
- సేవా ప్రస్థానానికి సన్మానంతో అభినందనలు







**ఖమ్మం ప్రతినిధి, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయునిగా సేవలందిస్తూ వేలాది మంది విద్యార్థుల జీవితాలకు వెలుగునిచ్చిన ఆదర్శ ఉపాధ్యాయుడు రాకం శ్యామ్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఖమ్మం నెహ్రూనగర్‌లోని పెన్షనర్స్ భవనంలో ఘనమైన వీడ్కోలు, అభినందన సభ నిర్వహించారు. విద్యారంగంలో విశిష్ట సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఆయన, ఉద్యోగ జీవితమంతా విద్యాబోధనతో పాటు సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేశారు.ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలల రిటైర్డ్ అధ్యాపక సంఘ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా రాకం శ్యామ్ చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది కేవలం ప్రభుత్వ సేవలకు మాత్రమేనని, సమాజానికి సేవ చేసే మనసుకు ఎప్పటికీ విరమణ ఉండదని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విలువలు పెంపొందించడం, సామాజిక చైతన్యం కల్పించడం, ప్రజా సమస్యల పట్ల స్పందించడం వంటి అంశాల్లో ఆయన చూపిన నిబద్ధత ఆదర్శనీయమని ప్రశంసించారు.రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం జరుగుతున్న ఉద్యమాలు, కార్యక్రమాల్లో రాకం శ్యామ్ తన అనుభవాన్ని సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని ఆకాంక్షించారు.అనంతరం సభలో రాకం శ్యామ్‌ను ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. భావోద్వేగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహచరులు, మిత్రులు, సంఘ నాయకులు ఆయన సేవలను స్మరించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. "విద్యార్థుల హృదయాల్లో గురువుగా, సమాజంలో సేవాభావంతో నిలిచిన రాకం శ్యామ్ సేవా ప్రస్థానం అందరికీ ఆదర్శం" అని సభలో పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాదినేని పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి జనార్ధన్, ఖాజా మొయినుద్దీన్, వెంకటనారాయణ, సత్యనారాయణ, రమణ యాదవ్, వెంకటేశ్వర్లు, బాబురావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ జావీద్‌కు ఘన నివాళి

- ఖమ్మంలో సంతాప సభ నిర్వహణ
- జావీద్ సేవలను స్మరించిన నాయకులు



**ఖమ్మం, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ కాలనీలో దివంగత మహమ్మద్ జావీద్ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని జావీద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిరాజుద్దీన్, జిల్లా కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డి, ఎస్.కె. ఇమ్రాన్ హుస్సేన్, మతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహమ్మద్ జావీద్ సమాజ సేవలో చూపిన అంకితభావం, ప్రజల పట్ల ఆయనకు ఉన్న మమకారం ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. జావీద్ మరణం సమాజానికి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవే పై సర్వీస్ రోడ్ ఏర్పాటు చేయండి

- ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి రుణాలు, ఉచిత బోరుబావులు మంజూరు చేయాలి.
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు వినతి



**ఖమ్మం ప్రతినిధి, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే, రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఒక సమగ్ర వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో ఇబ్బందులు పడుతున్న జిల్లా ప్రజలకు సర్వీసు రోడ్లు నిర్మించడంతో పాటు, దళిత, గిరిజన నిరుద్యోగులకు ఉపాధి రుణాలు, పేద రైతులకు వ్యవసాయ బోరుబావులు మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పై సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నెల్లూరి కోటేశ్వరరావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాగ్పూర్ – అమరావతి క్రాస్ నుంచి వైరా ఎగ్జిట్ వరకు ఉన్న 19.600 కిలోమీటర్ల నుంచి 33.200 కిలోమీటర్ల మార్గంలో రైతుల భూముల మధ్యలోంచి రోడ్డు నిర్మాణం జరిగిందని వివరించారు. దీనివల్ల పొలాలు రెండు భాగాలుగా విడిపోయి, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వెళ్లేందుకు, పండిన ధాన్యాన్ని ఇళ్లకు చేర్చేందుకు దారి లేకుండా పోయిందని, అదేవిధంగా జిల్లా ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ భూములన్నీ నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమాండ్ ఏరియా కింద ఉన్నాయని, రోడ్డు నిర్మాణంతో వాగులు, కాలువలు దాటి పశువులను మేతకు తీసుకెళ్లడం ప్రజలకు, రైతులకు కత్తిమీద సాములా మారిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారంగా హైవేకు ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించి జిల్లా ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. నిరుపేద దళిత, గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కోసం కేంద్ర బడ్జెట్ నుంచి ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. దినసరి కూలీలుగా ఉంటూ ఆర్థికంగా వెనుకబడిన యువత స్వయం ఉపాధి పొందేలా కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి వర్తింపజేయాలని కోరారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాధారం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బాలాజీ తండా గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులను మంత్రికి అందజేశారు.అలాగే, సింగరేణి మండలం మాధారం గ్రామానికి చెందిన పేద ఎస్సీ, ఎస్టీ రైతుల వ్యవసాయ భూములకు సాగునీటి సదుపాయం కల్పించాలని మంత్రిని కోరారు. సరైన నీటి వసతి లేక, సొంతంగా బోరుబావులు తవ్వించుకునే స్థోమత లేక ఎంతోమంది పేద రైతుల భూములు బీడువారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సాగునీటి పథకాలైన పీఎం–కుసుమ్, పీఎంకేఎస్‌వై ద్వారా ఈ గ్రామంలోని అర్హులైన రైతులకు ఉచితంగా బోరుబావులు, పంపుసెట్లు మంజూరు చేయాలని విన్నవించారు. తాను స్వయంగా క్షేత్రస్థాయిలో రైతుల దరఖాస్తులను పరిశీలించానని, కేంద్రం ఆదుకుంటే ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులు అనూహ్యంగా మెరుగుపడతాయని నెల్లూరి కోటేశ్వరరావు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

# గోషామహల్ బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం




**హైదరాబాద్, మే 31(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్, పార్టీ కమిటీలకు సంబంధించి గోషామహల్ బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. గోషామాహల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆర్.వి. మహేందర్ కుమార్, సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఇన్చార్జిగా నియమించబడ్డటువంటి నాగేందర్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గం లోని ఏడు డివిజన్ల నాయకులు ఉద్యమకారులు మరియు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో పార్టీ నేతలు శంకర్ లాల్ యాదవ్, ఏ వాసుదేవరావు,రమేష్ గుప్తా,నవీన్ వర్మ, సురేష్ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, బిజిని శ్రీనివాస్,మీసాల క్రాంతి, కొల్లి ప్రదీప్ రాజ్, విష్ణువర్ధన్,శాంతి దేవి, సునీల్ సింగ్, ఎండి సలీం, హుస్సేన్, యాసీన్, శ్రీనివాస్ యాదవ్, ఎర్ర రవి, శ్రీశైలం, సల్మాన్, గణేష్, మహేష్ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్: మంత్రి తుమ్మల








**ఖమ్మం ప్రతినిధి, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత నందమూరి తారక రామారావు అని, ఆయన చూపిన సేవా స్ఫూర్తితో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా 'కమ్మ మహాజన సంఘం' ఆధ్వర్యంలో ఖమ్మంలోని స్వర్ణభారతి కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదని, తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, సామాజిక బాధ్యతతో కమ్మ మహాజన సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి మరింత మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ శిబిరంలో కాన్సర్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, నేత్ర, స్త్రీరోగ, శిశు, ఈఎన్‌టీ, యూరాలజీ, న్యూరో తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు సేవలు అందించారు. అలాగే రక్తపరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ, ఎక్స్‌రే, మామోగ్రామ్ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలకు కాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం అత్యంత విలువైన వాహనాలను, పరికరాలను సంఘం సభ్యులు బత్తినేని ప్రకాష్ సమకూర్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరం విజయవంతం కావడంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖమ్మం శాఖ, కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, వైద్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు అందించిన సహకారం ప్రశంసనీయమని మంత్రి అన్నారు. కార్యక్రమం నిర్వహించిన కమ్మ మహాజన సంఘం ప్రతినిధులను మంత్రి అభినందించగా, శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ మేయర్ నీరజ, తుమ్మల యుగంధర్ కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షురాలు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, మేదరమెట్ల స్వరూపరాణి, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కోలేటి నవీన్, నంబూరి ప్రసాద్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్, బతినేని ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రటి ఎండలో ఆగని మంటలు

- భయాందోళనలో గ్రామ ప్రజలు





**చిట్యాల మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండుతున్న ఎండల్లో రైతులు తమ పంట పొలాల్లోని వరి, మొక్కజొన్న పంటల వ్యర్థాలను కాల్చుతున్నారు . దీంతో మంటలు చెలరేగి బీసీ కాలనీ రామ్ నగర్ కాలనీ గ్రామాలకు మంటలు రావడంతో ప్రజలు మంటలు ఆర్పే ప్రయత్నం చేసి చిట్యాల గ్రామ సర్పంచి గారికి సమాచార ఇవ్వడంతో వాటర్ ట్యాంక్ తో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అధికంగా రావడంతో సర్పంచి ఫైర్ ఇంజన్ ఆఫీస్ కు ఫోన్ చేసి రప్పించడం జరిగింది. ఫైర్ ఇంజన్ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు సహకారంతో మంటలను ఆర్పి వేయడం జరిగింది.

# కార్యకర్తల గుండెల్లో 'మధు'ర నినాదం..

- తెలంగాణ భవన్‌లో అంబరాన్నంటిన ఎమ్మెల్సీ తాతా మధుసూధన్ జన్మదిన వేడుకలు!
- జననేతకు జేజేలు
- అభిమాన సంద్రమైన ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం
- ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్





**ఖమ్మం ప్రతినిధి, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పదవులు అనేవి కేవలం బాధ్యతలు మాత్రమే కాదు.. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకునే ఆయుధాలని నిరూపించిన నిరాడంబర ప్రజానేత, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా మాజీ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్ జన్మదిన వేడుకలు ఆదివారం ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. ఆయనపై ఉన్న అపారమైన అభిమానాన్ని చాటుకుంటూ పార్టీ శ్రేణులు, అనుచరులు, కార్యకర్తలు కరతాళ ధ్వనుల మధ్య, జై నినాదాలతో తెలంగాణ భవన్‌ను ఒక అభిమాన సంద్రంగా మార్చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, భారీ కేక్ కట్ చేసి, అందరికీ మిఠాయిలు తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజ్, ఇతర సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. భావోద్వేగానికి గురయ్యారు. "తాతా మధుసూధన్ కేవలం ఒక పదవికో, హోదాకో పరిమితమైన నాయకుడు కాదు. కార్యకర్తకు కష్టం వస్తే నేనున్నానంటూ ముందు నిలిచే ప్రతి ఒక్కరి గుండె చప్పుడు ఆయన అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ల ఆశయాలను గుండెల్లో నింపుకొని, ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడంలో ఆయన పడుతున్న తపన, చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఒక సామాన్య కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి, ఈ రోజు శాసనమండలి సభ్యుడిగా ఎదిగిన ఆయన క్రమశిక్షణ, నిబద్ధత నేటి తరం యువ నాయకులకు నిరంతర ఆదర్శప్రాయం" అని కొనియాడారు. ఈ వేడుక కేవలం ఒక పుట్టినరోజు వేడుకలా కాకుండా.. కార్యకర్తలకు, నాయకుడికి మధ్య ఉన్న విడదీయరాని ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిలిచింది. ఈ ఆత్మీయ వేడుకల్లో ఒక కుటుంబ సభ్యుడి జన్మదినాన్ని తలపిస్తూ నాయకులంతా ఒక్కటై నిలిచారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖమర్, సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు ఉప్పుల వెంకటరమణ, లాకావత్ గిరి బాబు, లీగల్ సెల్ ప్రతినిధి బిచ్చాల తిరుమలరావు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, బాషబోయిన వీరన్న, వాచేపల్లి లక్ష్మారెడ్డి, వేముల వీరయ్య, ముత్యాల వెంకట అప్పారావు, మల్లీదు వెంకటేశ్వర్లు, ఆసిఫ్ పాషా, మంచా నాయక్, చుంచు విజయ్ కుమార్, చందు షేక్, మట్టా వెంకటేశ్వర్లు, జార్పుల లక్ష్మణ్, కాసాని సైదులు, పవన్, బిళ్ళగిరి ధనుంజయ్, మహ్మద్ రఫీ (రసూల్), బలుసు మురళీకృష్ణ, బాలు నాయక్, గూడ సంజీవ్ రెడ్డి, తాతా రవీందర్, మద్దెల విజయ్, యలమద్ది రవి, బానోత్ రవి, బంక మల్లయ్య, చావా శ్రీనివాస్, లింగనబోయిన సతీష్, చీకటి రాంబాబు, ఆరెంపుల వీరభద్రం, ఇటికల శ్రీనివాస్, వేముల ప్రసాద్, మంకెన రమేష్, చిత్తారు సింహాద్రి యాదవ్, మోరం పాపారావు, సద్దాం, కొండల్ రావు, కొరివి ధనలక్ష్మి, ఆసిఫ్, బురాన్, సింగ్, పిడతల రామ్మూర్తి తదితర సీనియర్ నాయకులతో పాటు, వివిధ మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ప్రియతమ నేతకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నరేంద్రనాథ్ దత్తు కుమారుడికి ఆశీర్వాదాల హారతి

- పంచకట్టు వేడుకలో ప్రముఖులు, ఉద్యోగ సంఘాల నాయకుల సందడి
- ఆయురారోగ్యాలు, ఉజ్వల భవిష్యత్తు కోరుతూ ఆశీస్సులు



**ఖమ్మం ప్రతినిధి, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బాల్యం ప్రతి కుటుంబానికి ఓ మధురమైన జ్ఞాపకం. అలాంటి మధుర క్షణాల్లో ఒకటైన పంచకట్టు వేడుక ప్రముఖ వ్యాపారవేత్త కందుల నరేంద్రనాథ్ దత్తు కుమారుడికి ఆదివారం వైభవంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రముఖులు సమక్షంలో బాబు జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన ఈ వేడుక ఆప్యాయతలతో, ఆశీర్వాదాలతో కళకళలాడింది. ఈ శుభసందర్భానికి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరై నరేంద్రనాథ్ దత్తు కుమారుడిని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. "కుమారుడు ఆరోగ్యంగా, ఆనందంగా ఎదిగి కుటుంబానికి, సమాజానికి గర్వకారణం కావాలని" ఆకాంక్షించారు. ఆనందోత్సాహాల నడుమ సాగిన ఈ వేడుకలో అతిథులు ఆనందోత్సాహాల నడుమ సాగిన ఈ వేడుకలో అతిథులు నరేంద్రనాథ్ దత్తు కుమారుడు ఆయురారోగ్యాలతో, విద్యావంతుడిగా, విలువలతో కూడిన వ్యక్తిగా ఎదగాలని దీవించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ బంధాలు, మానవీయ విలువలు, ప్రేమాభిమానాలకు ప్రతీకగా నిలిచిన ఈ పంచకట్టు వేడుక అందరి హృదయాల్లో మధుర జ్ఞాపకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, టిజీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవో అసోసియేటెడ్ అధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ హరీష్‌తో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రముఖులు పాల్గొని చిన్నారికి ఆశీస్సులు అందజేశారు.

# డీఈఈసెట్-2026 ఉత్తీర్ణుల ధ్రువపత్రాల పరిశీలన జూన్ 2 నుంచి..




**కరీంనగర్ టౌన్ మే 31(పీసీడబ్ల్యూ న్యూస్):** డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డైట్), ఎల్ఎండీ కాలనీ, కరీంనగర్ ప్రిన్సిపాల్ రామ్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. డైట్ మరియు ప్రైవేట్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ , డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన డీఈఈసెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయని పేర్కొన్నారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డీఈఈసెట్-2026లో అర్హత సాధించిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల ధ్రువీకరణ ప్రక్రియ జూన్ 2 నుంచి జూన్ 5 వరకు కరీంనగర్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్మీడియట్ మెమో, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు పీహెచ్‌సీ, ఎన్‌సీసీ, సీఏపీ తదితర ప్రత్యేక కేటగిరీలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకుని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య డైట్ కళాశాలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు డీఈఈసెట్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.


# డాక్టర్ పట్టా అందుకున్న దివ్య

- సామాన్య కుటుంబం నుంచి వైద్యురాలిగా ఎదిగిన యువతి




**నడికూడ, మే 31(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రానికి చెందిన నారగాని అనితరమేష్ దంపతుల కుమార్తె నారగాని దివ్య వైద్య విద్యను విజయవంతంగా పూర్తిచేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి కాలేజ్ ఆఫ్ హోమియోపతిక్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్‌లో హోమియోపతి వైద్య విద్యను అభ్యసించిన ఆమె ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పట్టాను స్వీకరించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన తాను కష్టపడి వైద్యురాలిగా ఎదిగానని దీనికి నా యొక్క తల్లి దండ్రుల కృషి ఎంతో ఉందని వారికి దివ్య తెలిపారు. భవిష్యత్తులో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. దివ్య డాక్టర్ పట్టా పొందిన సందర్భంగా గ్రామస్తులు, బంధుమిత్రులు ఆమెను అభినందించారు..

# ఇండియన్ యూత్ కాంగ్రెస్ తెలంగాణ లీగల్ సెల్ కోఆర్డినేటర్‌గా సయ్యద్ ఖమరుద్దీన్ (షాకిబ్) నియామకం



INDIAN YOUTH CONGRESS

Office: 5, Raisina Road, New Delhi-110001 Ph.: 23352472, 23318533 Fax: 011-23731816, Web site:www.iyc.in, Mobile: 9999223884, Email:advocateroopeshsingh@gmail.com, @RoopeshSinghINC

*Roopesh S. Bhadauria*
*Member, All Indian Congress Committee*
*National Secretary, Indian Youth Congress*
*National Chairman, Indian Youth Congress Legal Cell*

Date: 31.05.2026

PRESS RELEASE

I am pleased to appoint the following office bearers as **Co-Chairman & State Coordinators** of the **Telangana Pradesh Youth Congress Legal Cell** with immediate effect.

| Sl.No | Name | Designation |
|---|---|---|
| 1. | Vignendra Verma | Vice-Chairman |
| 2. | Kotha Uday Kiran Reddy | State Coordinator & Office Admn. |
| 3. | Ganne Jyothsna Chowdhary | State Coordinator |
| 4. | Faizaan | State Coordinator |
| 5. | Lingampally Ravi Teja | State Coordinator |
| 6. | Syed Khamruddin | State Coordinator |

As Indian Youth Congress office bearers, there are serious challenges ahead of us. We must dedicate ourselves wholeheartedly to work together in order to strengthen the arms of Congress President **Shri Mallikarjun Kharge ji, Smt. Sonia Gandhi ji, Shri Rahul Gandhi ji** and **Smt. Priyanka Gandhi Vadra ji**. I wish to share that **IYC In-charge Shri Manish Sharma ji** and **IYC National President Shri Uday Bhanu Chib ji** are

**కరీంనగర్ జిల్లా మే 31(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇండియన్ యూత్ కాంగ్రెస్ తెలంగాణ లీగల్ సెల్ కోఆర్డినేటర్‌గా సయ్యద్ ఖమరు ద్దీన్ (షాకిబ్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, యువజన కార్యకర్తలు, స్నేహితులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరైన సయ్యద్ ఖమరుద్దీన్ తన ప్రతిభ, సామర్థ్యాలతో ఈ బాధ్యతను పొందడం విశేషంగా నిలిచింది. యువత సమస్యల పరిష్కారం, న్యాయపరమైన అవగాహన కల్పించడం, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను యువతలో విస్తృతంగా ప్రచారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకం తనపై మరింత బాధ్యతను పెంచిందని, పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ యువతకు సేవ చేసేందుకు కృషి చేస్తానని సయ్యద్ ఖమరుద్దీన్ (షాకిబ్) తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.



# యాదవుల సంఘ పెద్దగా ఎన్నికైన సాయికి ఘన సన్మానం

- పోట్రు ప్రవీణ్ ఆధ్వర్యంలో

**శాలువాతో సత్కారం... శుభాకాంక్షల వెల్లువ**



**కల్లూరు, మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సాయి కల్లూరు మున్సిపాలిటీ యాదవుల సంఘ పెద్దగా ఎన్నిక కావడంతో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. మండల పరిధిలో ఎర్రబోయినపల్లి గ్రామంలో పోట్రు లక్ష్మయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రధాన అనుచరుడు పోట్రు ప్రవీణ్ తన నివాసంలో సాయిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పోట్రు ప్రవీణ్ మాట్లాడుతూ యాదవుల సంఘానికి సాయి నాయకత్వం వహించడం ఆనందదాయకమని అన్నారు. సమాజ అభివృద్ధి, ఐక్యత కోసం ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. యువతలో సేవా భావం పెంపొందించి, సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని సూచించారు. యాదవుల సంఘ పెద్దగా ఎన్నిక కావడం పట్ల సాయికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రవీణ్, ఆయనకు నోరు తీపి చేసి విజయవంతమైన నాయకత్వాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ యాదవుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సాయికి అభినందనలు తెలిపారు. సంఘ ఐక్యత, సామాజిక అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. యాదవుల సంఘానికి నూతన నాయకత్వం లభించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, సాయి విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు సాయికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# బడిబాట కార్యక్రమం విజయవంతం





**గంగాధర మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం చొప్పదండి మండలంలో ఈరోజు మల్లాపూర్ మరియు గోపాలరావుపల్లి గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ శ్రీమతి కొలేపాక కవిత , ప్రధానోపాధ్యాయులు శ్రీ సలువాజీ నాగేశ్వరరావు , పీఎస్ ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీ రమేష్ , ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచ్ శ్రీమతి కొలేపాక కవిత గారి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల నమోదు ( అడ్మిషన్స్) చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ( ఎంఈఓ ) శ్రీ ఎనుగు ప్రభాకర్ రావు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, అత్యుత్తమ మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, సాంకేతిక పరిజ్ఞానంతో బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, ప్రోగ్రెస్ కార్డులు, మధ్యాహ్న భోజన పథకం మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ విద్యార్థుల ప్రవేశాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభించగా, పలువురు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. బడిబాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.



# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నిలువు దోపిడి

**బడులు తెలుసుకోకముందే ఫీజుల వేట**

**ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలు**

**ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు అనుమతులు తీసుకొని పదవ తరగతి వరకు పాఠాలు**

**ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం తేవాలి**

**ఫైర్, ట్రాఫిక్ పోలీసుల అనుమతులు, శానిటేషన్ అనుమతులు లేకున్నా పాఠశాలలు నిర్వహించవచ్చా..?**

**అనుమతులకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలకు రాజకీయ నాయకుల అండదండలు ఉంటే పాఠశాలలపై చర్యలు తీసుకోరా..?**




**హైదరాబాద్ మే 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్త విద్యా సంవత్సరం మరికొన్ని రోజుల్లో (2026-27) ప్రారంభం కానుండటంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు మళ్లీ ఫీజుల వేట మొదలుపెట్టాయి. బడులు ఇంకా తెరుచుకోకముందే అడ్మిషన్లు, పుస్తకాలు, యూనిఫామ్ల పేరిట సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులకు భారీ చిల్లు పెడుతున్నాయి. ప్రభుత్వ జీవోలు, కోర్టుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ క్షేత్రస్థాయిలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజు రాజ్యం నిరంకుశంగా సాగుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఫీజులను ఏకంగా 20% నుండి 30% వరకు పెంచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రాథమిక తరగతులకే రూ.50 వేల నుండి రూ. 1 లక్ష వరకు వసూలు చేస్తుండటం గమనార్హం. హైస్కూల్ విద్యార్థులకు అయితే టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ అంటూ స్కూలు స్థాయిని బట్టి రూ. 1.5 లక్షల నుండి రూ.3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. పాఠాలు నేర్పే ఉపాధ్యాయుల పాఠ్యపుస్తకాలు అమ్మే కిరాణా దుకాణం యజమానుల చదువు చెప్పాల్సిన పాఠశాలలు ఇప్పుడు పక్కా వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. కేవలం ట్యూషన్ ఫీజుతోనే ఈ దోపిడీ ఆగడం లేదు. పుస్తకాలు స్కూల్ యూనిఫార్మ్ పాఠశాల ఆవరణలోనే లేదా వారు చెప్పిన నిర్దిష్ట దుకాణాల్లోనే పుస్తకాలు, నోట్బుక్స్, బెల్టులు, షూస్ కొనాలనే నిబంధన విధిస్తున్నారు. బయట మార్కెట్లో రూ.2,000 పలికే పుస్తకాల సెట్ను, స్కూళ్లలో రూ.6,000 నుండి రూ. 8,000 వరకు విక్రయిస్తూ భారీగా కమీషన్లు వెనకేసుకుంటున్నారు. డిజిటల్ క్లాసులు, స్మార్ట్ బోర్డులు, స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్స్ అంటూ నెలనెలా ఏదో ఒక సాకుతో అదనపు బాదుడు తప్పడం లేదు.

**నిమ్మకు నీరెత్తినట్లు విద్యాశాఖ!** ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం గతంలో ప్రభుత్వం కమిటీలు వేసినా, నిబంధనలు తెచ్చినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రతి స్కూల్ తమ ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలనే నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. పేరెంట్స్ కమిటీ ప్రతి పాఠశాలలో వేయాలని విద్యాశాఖ అధికారులు తెలిపిన ఎక్కడ కూడా పేరెంట్స్ కమిటీని వేయకుండా ఇష్టానుసారంగా ఫీజులను పెంచుకుంటూ పోతున్నారని, విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రైవేట్ యాజమాన్యాలు మరింత రెచ్చిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూన్ మొదటి వారంలో బడులు ప్రారంభం కానుండటంతో ఇప్పటికైనా జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, ఫీజుల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రశ్నార్థకంగా మారిన జీవో 46!** ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు, పారదర్శకత పెంచేందుకు గతంలో తీసుకొచ్చిన జీవోలు క్షేత్రస్థాయిలో అటకెక్కాయి. ఏటా ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచకూడదనే నిబంధనను ఏ ఒక్క కార్పొరేట్ సంస్థా పాటించడం లేదు. అధికారులు కేవలం నామమాత్రపు నోటీసులతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**తల్లిదండ్రుల ఆవేదన** పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా పెద్ద స్కూళ్లలో చేర్పిస్తున్నాం. కానీ ఏటా బుక్స్, డ్రెస్సులు, బిల్డింగ్ ఫీజులంటూ వేలల్లో పెంచుకుంటూ పోతే మాలాంటి మధ్యతరగతి కుటుంబాలు ఎలా బతకాలి? ప్రభుత్వం ఫీజులపై ఖచ్చితమైన పరిమితి విధించాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా స్కూల్లో వైపు చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్న ప్రవేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

**గల్లీకో ప్లే స్కూల్** ప్రభుత్వ అనుమతులు లేకుండా గల్లీకో ప్లే స్కూల్ ఎల్కేజీ ,యూకేజీ ,నర్సరీ, తరగతులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఈ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఇష్టానుసారంగా తమకు తోచిన విధంగా ఫీజులను పెంచుకుంటూ పోతున్నారని, ఈ పాఠశాలకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో స్థానిక డిఇఓ ఎంఈఓ లు ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదని, జరగరాని సంఘటన జరిగితే దానికి బాధ్యులు స్థానిక రాజకీయ నాయకుల లేక డీఈవో,ఎంఈఓ, బాధ్యతలు తీసుకుంటారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఫీజుల నియంత్రణపై కమిటీని వేయాలని సామాన్య మధ్యతరగతి ప్రజలు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేట్ పాఠశాలలపై కమిటీని వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సుడా రెండేళ్ల ప్రగతి అద్భుతం: చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ టౌన్ మే 31 (పీసీడబ్ల్యూ న్యూస్):** స్మార్ట్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) గత రెండేళ్ల కాలంలో విశేషమైన అభివృద్ధి సాధించిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. సుడా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుడా ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. సుడా రెండేళ్ల ప్రగతిని ప్రజలకు వివరించేందుకు జూన్ 1 నుంచి జూన్ 15 వరకు ప్రత్యేక పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత రెండేళ్లలో సుడా పరిధిలో రూ.30 కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, హైమాస్ట్ లైట్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో సుడా కమర్షియల్ బిల్డింగ్, ఐడీఎస్ఎంటి ప్రాజెక్టులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అలాగే అంగారిక టౌన్షిప్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శవంతమైన టౌన్షిప్గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. జూన్ 15న సుడా రెండేళ్ల ప్రగతిపై సమగ్ర నివేదికను విడుదల చేయనున్నట్లు చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెల్లడించారు. సుడా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకారం ఎంతో ఉందని ఆయన అభినందించారు.

## వైఎస్సార్సీపీ గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధిగా కె.వి.రమణకు ఘన సన్మానం

**● బెస్త సాధికార కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ**

**ఉరవకొండ మే 31 (పీసీడబ్ల్యూ న్యూస్):** వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు కె.వి. రమణను గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధిగా నియమించిన సందర్భంగా ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో బెస్త సాధికార కమిటీ ఆధ్వర్యంలో ఘన అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నల్లపురెడ్డి, మాజీ మేయర్ వసీం సలీం, వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యుడు నదీ మహమ్మద్, హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డి, రిలాక్స్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ రాయలసీమ



సమస్యలు, ప్రాంతీయ పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన కె.వి. రమణను పార్టీ అధికార ప్రతినిధిగా నియమించడం సముచిత నిర్ణయమని పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేసే మచ్చలేని నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని విశ్వసించే వ్యక్తిగా కె.వి. రమణ ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. అలాగే పార్టీ బలోపేతం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మీడియా, సోషల్ మీడియా వేదికలపై నిర్మాణాత్మక చర్చలు నిర్వహించాలని సూచించారు. అనంతపురం జిల్లా పార్టీ యావత్తు కె.వి. రమణకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.వి. రమణ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా సమన్వయకర్తలు సహా సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం భయానక పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్సీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ బలోపేతానికి తాను అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కె.వి. రమణ స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులు, బెస్త సాధికార కమిటీ నాయకులు కే.శ్రీనివాసులు, సురేష్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కె.వి. రమణను శాలువాలు, పూలహారాలతో ఘనంగా సత్కరించారు.

## కవిత సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరికలు..




**కరీంనగర్ జిల్లా మే 31(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థి, యువజన, మహిళా నాయకులు ఆదివారం హైదరాబాద్లోని టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో పార్టీలో చేరారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కరీంనగర్ జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ జేఏసీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు చెన్నమల్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గుగులోతు దివ్య, చింతకుంట మాజీ వార్డు సభ్యుడు గుర్రం సత్యం గౌడ్, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్, చింతకుంట మహిళా విభాగం నాయకురాలు పూజతో పాటు పలువురు విద్యార్థి, యువజన, మహిళా నాయకులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఉరవకొండ పంచాయతీ రేసులో విశ్రాంత పోలీస్ అధికారి హాట్ టాపిక్

**● ప్రధాన పార్టీల్లో టికెట్ కోసం పోటీ తీవ్రం ● సామాజిక సమీకరణాలు,వ్యక్తిగత ఇమేజ్పై ఆసక్తికర చర్చ**

**ఉరవకొండ మే 31 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. సుమారు 55 వేలకుపైగా జనాభా కలిగిన ఈ పంచాయతీపై ప్రధాన రాజకీయ పార్టీల దృష్టి కేంద్రీకృతమైంది. ముందస్తు వ్యూహాలతో ఆశావహులు ఇప్పటికే రంగంలోకి దిగడంతో స్థానిక రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఎన్నికల్లో ప్రస్తుతం అందరి దృష్టి ఇటీవల పదవీ విరమణ చేసిన ఓ మాజీ పోలీస్ సర్కిల్ అధికారిపైనే నిలిచింది. ప్రజలతో సాన్నిహిత్యం, సేవాభావం, స్థానికంగా ఉన్న పట్టుతో ఆయన పేరు బలంగా వినిపిస్తోంది. చేనేత సామాజిక వర్గం తర్వాత అధిక జనాభా కలిగిన మైనారిటీ వర్గానికి చెందిన ఆయనకు టీడీపీ కీలక నేతల మద్దతు కూడా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో టీడీపీ తరపున ఆయన అభ్యర్థిత్వం దాదాపు ఖాయమనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే టీడీపీలోనే సర్పంచ్ టికెట్ కోసం పోటీ తీవ్రంగానే కనిపిస్తోంది. ఇటీవల సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసిన ఓ యువ మైనారిటీ నాయకుడు ప్రజల్లో గుర్తింపు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు స్టాంప్ వెండర్గా, రచయితగా గుర్తింపు పొందిన మరో మైనారిటీ నేత కూడా సర్పంచ్ రేసులో ఉన్నట్లు సమాచారం. దీంతో టీడీపీ అధిష్టానం చివరకు ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఆసక్తిగా మారింది. మరోవైపు



వైఎస్సార్సీపీ వర్గాల్లోనూ ఎన్నికల చర్చ వేడెక్కుతోంది. ఎమ్మెల్సీ కొనకొండ్ల శివరామిరెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందిన ఆకుకూర నాగరాజు ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన ఓ విశ్రాంత మహిళా,

శిశు సంక్షేమ అధికారిణి కూడా మళ్లీ బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే వర్గం నుంచి మాత్రం ఇంకా స్పష్టమైన అభ్యర్థి పేరు బయటకు రాలేదు. అభ్యర్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ప్రజల్లో మాత్రం "విశ్రాంత పోలీస్ అధికారి అయితేనే పంచాయతీకి సరైన నాయకత్వం అందించగలరు" అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రానున్న ఎన్నికల్లో సామాజిక సమీకరణాలు, పార్టీల ప్రభావం, వ్యక్తిగత ఇమేజ్, ప్రజా సేవ వీటిలో దేనికి ఓటర్లు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఉరవకొండ పంచాయతీ పీఠాన్ని చివరకు ఎవరు దక్కించుకుంటారో తెలుసుకోవాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

# ఇంగ్లండ్‌పై భారత్ ఓడినా.. తెలుగమ్మాయి శ్రీ చరణి గెలిచేసింది, ఓటమిలోనూ ఆశాకిరణం!

ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా ఓటమిపాలయింది. దాంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1 – 1 తో సరిసమానమైంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓడిపోయినప్పటికీ శ్రీ చరణి బౌలింగ్ ఆకట్టుకుంది. ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి 25 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసుకుంది. టీ 20 వరల్డ్‌కప్ ముందు శ్రీ చరణి ప్రదర్శన భారత్‌కు బాగా కలిసొచ్చే అంశంగా మారింది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న టీ20 సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో టీమిండియా ఉమెన్స్ టీమ్ ఓటమిపాలయింది. తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్, రెండో మ్యాచ్‌లో మాత్రం ఓటమిపాలయింది. టీ20 వరల్డ్‌కప్ ముందు జరుగుతున్న ఈ సిరీస్‌లో తెలుగమ్మాయి శ్రీ చరణి అందర్నీ ఆకట్టుకుంది. టీమిండియా స్పిన్ విభాగం ఎంత బలంగా ఉందో నిరూపించింది. బ్రిస్టల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. దాంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 1 – 1తో సమమైంది. దాంతో మూడో మ్యాచ్ ఇరు జట్లకు కీలకంగా మారింది.

మహిళల టీ20 వరల్డ్‌కప్ ముందు జరుగుతున్న ఈ సిరీస్ భారత జట్టుకు ఎంతో కీలకమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. స్కోర్ చేస్తున్న బ్యాటర్లను



శ్రీ చరణి అద్భుత స్పిన్‌తో పెవిలియన్‌కు పంపింది. దాంతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. శ్రీ చరణి నాలుగు ఓవర్లలో 25 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసుకుంది. శ్రేయాంక పాటిల్ కూడా నాలుగు ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసుకుంది. ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన టీమిండియా ఈ మ్యాచ్‌లో కూడా విజయం సాధిస్తుందని అందరూ అనుకున్నారు. తొమ్మిది ఓవర్లకే 70 పరుగులు చేయడంతో ఓవర్లు మిగిల్చి మ్యాచ్ గెలుస్తారని అనుకున్నారు. కానీ స్మృతి మంధాన అవుటైన తర్వాత సీన్ మారిపోయింది. స్మృతి మంధాన 32, షెఫాలీ వర్మ 22, యస్తికా భాటియా 33 రిటైర్డ్ హట్, హర్మన్ ప్రీత్ కౌర్ 28 పరుగులు చేసి అవుటయ్యారు. ఇక మిగతా ఏ బ్యాటర్ కూడా పది పరుగులు కూడా దాటలేకపోవడంతో 20 ఓవర్లలో 142/9 పరుగులు చేసి 26 పరుగుల తేడాతో ఓడిపోయింది.

## సమయం లేదు మిత్రమా సమరమే.. ఆర్సీబీ వర్సెస్ గుజరాత్, ఎవరూ గెలిచినా చరిత్రే!

ఐపీఎల్ 2026 ముగింపు ఘట్టానికి వచ్చింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ పోరు జరగనుంది. ఈ రెండు జట్లు ఇప్పటి వరకు చెరొకసారి ఛాంపియన్‌గా నిలిచాయి. దాంతో ఎవరు గెలిచినా రెండోసారి టైటిల్ అందుకోవడం ఖాయం. ఈ సీజన్‌లో ఇరు జట్లు మూడు మ్యాచ్‌లలో ఆడితే.. లీగ్‌లో చెరొక మ్యాచ్‌లో విజయం సాధించగా, క్వాలిఫయర్ 1లో గుజరాత్ ఓటమిపాలయింది. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్ పోరులో ఎవరు విజయం సాధిస్తారు అనేది ఆసక్తికరంగా మారింది.

ఐపీఎల్ 2026 అసలైన సమరానికి సమయం ఆసన్నమైంది. అహ్మదాబాద్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ పోరు జరగనుంది. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటి వరకు ఈ రెండు జట్లలో ఏదీ కూడా రెండు టైటిల్స్ సొంతం చేసుకోలేదు. దాంతో ఇవాళ గెలిచిన జట్టు చరిత్రలో నిలవబోతోంది. అహ్మదాబాద్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – గుజరాత్ టైటాన్స్ మధ్య ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. మ్యాచ్ లైవ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్ వేదికగా వీక్షించొచ్చు. ఐపీఎల్ చరిత్రలో



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మొత్తం ఐదుసార్లు ఫైనల్స్‌కు చేరుకోగా.. 2025లో ఛాంపియన్‌గా అవతరించింది. 2009, 2011, 2016లో ఫైనల్ వరకూ వచ్చి రన్నరప్‌గా మిగిలింది. ఇక గుజరాత్ టైటాన్స్ జట్టు ఐపీఎల్‌లో అడుగుపెట్టిన తొలి సీజన్‌లోనే విజేతగా నిలిచింది. 2002లో ఐపీఎల్‌లో అడుగుపెట్టిన గుజరాత్ టైటాన్స్‌ను అదే ఏడాది హార్దిక్ పాండ్యా ఛాంపియన్‌గా నిలపగా.. 2023లో మళ్లీ ఫైనల్‌కు వెళ్లి ఓడిపోయింది. మళ్లీ ఇప్పుడు మూడో సారి ఫైనల్ బరిలో నిలిచింది. ఈ ఐపీఎల్‌లో లీగ్ స్టేజ్‌లో ఇరు జట్లు రెండు సార్లు తలపడ్డాయి. బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఓడి పోగా.. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ ఓడిపోయింది. క్వాలిఫయర్ 1లో ధర్మశాల వేదికగా జరిగిన ఓడిపోయింది.

## ఆర్సీబీకి షాకిచ్చేలా గుజరాత్ పెద్ద ప్లాన్.. ఫైనల్ కోసం ఓడిపోయిన పిచ్ సిద్ధం!



ఐపీఎల్ 2026కు ముందు ఆర్సీబీని కలవరపెట్టే వార్త ఒకటి వచ్చింది. ఫైనల్‌కి తయారు చేసే పిచ్ ఇప్పుడు ఆర్సీబీని భయపెడుతోంది. ఎందుకంటే లీగ్ స్టేజ్‌లో గుజరాత్‌పై ఓడిపోయిన పిచ్‌నే ఇప్పుడు ఫైనల్ కోసం సిద్ధం చేస్తున్నారు. అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ జరగనుండటం గుజరాత్‌కు కలిసొచ్చే అంశం కాగా.. ఆర్సీబీకి మాత్రం కొంచెం టెన్షన్‌గానే ఉంది. లీగ్‌లో అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ కేవలం 155 పరుగులకే ఆలౌట్ అయింది.

రెండు నెలలు పాటు సాగిన ఐపీఎల్ 2026 సమరం ఆఖరి ఘట్టానికి చేరుకుంది. లీగ్ స్టేజ్‌లు, ప్లే ఆఫ్స్‌లో నువ్వా నేనా అన్నట్టు తలపడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – గుజరాత్ టైటాన్స్ జట్లు ఫైనల్ బరిలో నిలిచాయి. గుజరాత్ హోం గ్రౌండ్ అహ్మదాబాద్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో ఆర్సీబీకి షాకిచ్చేలా పెద్ద ప్లానే రెడీ చేశారు. ఐపీఎల్ 2026లో ఈ రెండు జట్లు మొత్తం మూడు మ్యాచ్‌లలో తపడ్డాయి. లీగ్ స్టేజ్‌లో జరిగిన మ్యాచ్‌లలో బెంగళూరు ఆర్సీబీ, అహ్మదాబాద్‌లో గుజరాత్ ఘన విజయాలు సాధించాయి. ఫైనల్ బెర్త్ కోసం ఈ రెండు జట్ల మధ్య ధర్మశాల వేదికగా జరిగిన క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. ఫైనల్ మాత్రం అహ్మదాబాద్‌లో జరగనుండటం గుజరాత్‌కు కలిసొచ్చే అంశం. ఫైనల్ మ్యాచ్‌కి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు షాకిచ్చేలా గుజరాత్ పెద్ద ప్లానే సిద్ధం చేసింది. లీగ్ స్టేజ్‌లో ఈ రెండు జట్ల మధ్య జరిగిన పిచ్‌నే ఇప్పుడు ఫైనల్‌కీ సిద్ధం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో లీగ్ మ్యాచ్ ఆడిన పిచ్ నెంబర్ 6నే ఫైనల్‌కూ సిద్ధం చేశారు. ఈ పిచ్‌పై ఆర్సీబీ బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ కేవలం 155 పరుగులకే ఆలౌట్ అయింది. అర్షద్ ఖాన్ మూడు వికెట్లు, రషీద్ ఖాన్ రెండు, జేసన్ హోల్డర్ రెడు వికెట్లు తీసుకుని మ్యాచ్ విజయంలో కీలకంగా మారారు. మొదట బ్యాటింగ్ చేసినప్పుడు పిచ్ బౌలింగ్‌కి సహకరించగా.. సెకండ్ మారింది.

# వైభవ్ సూర్యవంశీని పొగడ్తలతో ముంచెత్తిన సచిన్ టెండూల్కర్.. టీమిండియాలోకి బుడ్డోడి ఎంట్రీపై క్లారిటీ!

వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని సచిన్ టెండూల్కర్ ఆకాశానికి ఎత్తాడు. ఐపీఎల్ 2026లో 16 ఇన్నింగ్స్‌లు ఆడిన ఈ 15 ఏళ్ల బుడ్డోడు 776 పరుగులు చేశాడు. 72 సిక్సర్లతో క్రిస్ గేల్ రికార్డును కూడా ఊదేశాడు. అలాంటి వైభవ్‌కు సచిన్ టెండూల్కర్ కొన్ని సూచనలు ఇచ్చాడు. తన ఆటతీరుకు ఏ మాత్రం మార్చుకోవద్దని చెప్పాడు. టెస్టు జట్టులోకి రావాలని తాను కోరుకుంటున్నానని, ఆ నిర్ణయం సెలక్టర్లదే అని సచిన్ చెప్పాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీని పొగడ్తలతో ముంచెత్తాడు. ఐపీఎల్‌లో సంచలన ఇన్నింగ్స్‌లు ఆడిన వైభవ్ ఆట తీరుకు సచిన్ టెండూల్కర్ కూడా ఫిదా అయ్యాడు. భారీ షాట్స్, సిక్సర్లకే కాదు వైభవ్ మణికట్టు బ్యాటింగ్ క్రికెట్ గాడ్‌ని ఆకట్టుకుంది. టీమిండియాలోకి వైభవ్‌ను తీసుకోవాలన్న వాదనపై సచిన్ టెండూల్కర్ కూడా స్పందించాడు.

ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ అద్భుద ప్రదర్శన చేశాడు. 16 ఇన్నింగ్స్‌లు ఆడిన సూర్యవంశీ 776 పరుగులతో ప్రస్తుతానికి టాప్ ప్లేస్‌లో నిలిచాడు. ఈ సీజన్‌లో 237.31 స్ట్రయిక్ రేట్‌తో 72 సిక్సర్లు బాది యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్, ఆండ్రీ రస్సెల్ పేరు మీద ఉన్న రికార్డులన్నీ బద్దలు కొట్టాడు.

ఇటీవల జరిగిన ఓ అవార్డుల ఫంక్షన్‌కు హాజరైన సచిన్ టెండూల్కర్ వైభవ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "అతడు నిజంగా ఓ స్పెషల్ ప్లేయర్. కేవలం భారీ షాట్లు ఆడటమే కాదు, అతని మణికట్టు పనితీరు నన్ను బాగా ఆకట్టుకుంది. మైదానం నలుమూలలా షాట్లు ఆడాలంటే అద్భుతమైన వ్రిస్ట్ వర్క్ ఉండాలి. అతడు కేవలం బంతిని బలంగా కొట్టడం లేదు.. బంతి లైన్, లెంగ్త్‌ను ముందుగానే అంచనా వేసి సులభంగా సిక్సర్లు కొడుతున్నాడు" అని సచిన్ టెండూల్కర్ ప్రశంసిచాడు.

ఇక వైభవ్‌ను టీమిండియాలోకి తీసుకోవాలని మాజీ క్రికెటర్లు, ప్రపంచ స్థాయి ఆటగాళ్లు కోరుకుంటున్న నేపథ్యంలో సచిన్ టెండూల్కర్ కూడా స్పందించాడు. "టెస్టు క్రికెట్‌లో ఎప్పుడో ఒకప్పుడు అతడిని చూడాలని అందరూ కోరుకుంటారు. నేనూ కోరుకుంటున్నాను. కానీ



అది ఎప్పుడు జరుగుతుందో చెప్పలేము. అనవసర ఒత్తడి పెట్టకూడదు. అతన్ని జట్టులోకి తీసుకోవాలా? వద్దా? అనే బాధ్యత సెలెక్టర్లది. వైభవ్‌ను అతని ఆట అతను ఆడుకునే ఫ్రీడమ్ ఇవ్వాలి.

నేను వైభవ్‌కి చెప్పేది ఒక్కటే.. నువ్వు ఎలా ఆడుతున్నావో అలాగే ఆడు. నీ స్టయిల్ మార్చుకోవద్దు. టెస్టు క్రికెట్‌లో వయస్సుతో పాటు అనుభవం కూడా అవసరం. ఇలాంటి సమయంలో అతడి ఆటలో ఎక్కువ మార్పులు చేయడానికి ప్రయత్నిస్తే అతడికి ఇబ్బందిగా మారొచ్చు" అని సచిన్ టెండూల్కర్ అన్నాడు.

మహేష్ గోనెరచయిత గురించి

# ఆస్ట్రేలియాను అల్లాడించిన అరాఫత్.. డెబ్యూ మ్యాచ్‌లో 5 వికెట్లతో సత్తా

పాకిస్తాన్ వేదికగా జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు తొలి మ్యాచ్‌లో ఓటమిపాలవుతోంది. ఐపీఎల్ జరుగుతుండటంతో సీనియర్ ప్లేయర్లకు రెస్ట్ ఇచ్చిన ఆసీస్ జోస్ ఇంగ్లిస్ కెప్టెన్సీలో యువ జట్టును పాక్‌కు పంపించింది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ యువ ఆల్‌రౌండర్ అరాఫత్ మిన్హాస్ అదరగొట్టాడు. బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసుకోవడంతో పాటు 18 పరుగులు కూడా తీయడంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో పాక్ 1 – 0తో ఆధిపత్యంలో ఉంది. ఆస్ట్రేలియా ప్లేయర్లు పాకిస్తాన్ డెబ్యూ బౌలర్ అల్లాడించాడు. ఐపీఎల్ ముగించుకుని ఆస్ట్రేలియా టూర్‌లో జాయిన్ అయిన ప్లేయర్లు అంతగా రాణించలేకపోయారు. దానికి తోడు అండర్ 19లో అద్భుత ప్రదర్శన చేసిన పాక్ బౌలర్.. తన తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటి ఆసీస్ బ్యాటర్లకు ముచ్చెమటలు పట్టించాడు. ఫలితంగా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో



పాకిస్తాన్ 1 – 0తో ఆధిపత్యం సాధించింది. పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బోల్తా కొట్టింది. రావల్పిండి క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. అరాఫత్ మిన్హాస్ తన బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లకు హడలెత్తించారు. ఆస్ట్రేలియా ఓపెనర్లు అలెక్స్ క్యారీ – మాథ్యూ షార్ట్ తొలి వికెట్‌కు 34 పరుగులు జోడించారు. అలెక్స్ క్యారీ త్వరగా అవుటైనప్పటికీ మాథ్యూ షార్ట్ మాత్రం నిలకడగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. యువ బౌలర్ అరాఫత్ ఆస్ట్రేలియా కెప్టెన్ జోస్ ఇంగ్లిస్, మార్నస్ లబుషేన్‌ను ఒకే ఓవర్‌లో అవుట్ చేయడం.. ఆ తర్వాత ఓవర్‌లోనే కామెరూన్ గ్రీన్ వికెట్ కూడా తీసుకోవడంతో ఆసీస్ మిడిలార్డర్ కుప్పకూలింది. లబుషేన్, గ్రీన్ డకౌట్ కావడంతో 68 పరుగులకే ఆసీస్ 4 వికెట్లు కోల్పోయింది. కష్టాల్లో ఉన్న జట్టును మాథ్యూ షార్ట్ – మాట్ రెన్షా కలిసి ముందుకు తీసుకెళ్లారు. షార్ట్ 76 బంతుల్లో 55, మాట్ రెన్షా 63 బంతుల్లో 61 పరుగులు చేసి అవుటయ్యారు. ఆఖర్లో కూప్నొమాన్ 24 పరుగులు చేయడంతో 44.1 ఓవర్లలోనే 200 పరుగులకు ఆలౌట్ అయింది. అరాఫత్ మిన్హాస్ 10 ఓవర్లలో ఒక మెయిడిన్‌తో 32 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసుకోగా, అబ్రార్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టాడు. ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టు 42.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. బాబర్ ఆజామ్ 94 బంతుల్లో 69 పరుగులు చేయగా, ఘాజీ ఘోరీ అందించారు.

## ఫైనల్లో టాస్ ఓడిన గుజరాత్.. రెండోసారి ట్రోఫీ ఎవరిదో..!




అంటూ వరసగా రెండో ఫైనల్ ఆడుతోంది. దాంతో.. ట్రోఫీని గెలిచేది ఎవరు? అనేది ఉత్కంఠ రేపుతోంది. లీగ్ దశలో చెరొక మ్యాచ్ గెలిచిన ఆర్సీబీ, గుజరాత్ ఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యాయి. క్వాలిఫయర్ 1లో బెంగళూరు చేతిలో కంగుతిన్న గుజరాత్ క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌పై విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రాజస్థాన్‌పై శతకంతో కదం తొక్కి శుభ్‌మన్ గిల్(104) బిగ్ మ్యాచ్‌లో

పంతొమ్మిదో సీజన్ విజేత ఎవరో మరికాసేపట్లో తేలిపోనుంది. లీగ్ దశలో.. ప్లే ఆఫ్స్‌లో అత్యుత్తమ ఆటతో ఫైనల్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గుజరాత్ టైటాన్స్ రెండోసారి ట్రోఫీని ముద్దాడాలనే కసితో ఉన్నాయి. అహ్మదాబాద్ స్టేడియంలో ఇరుజట్ల మధ్య బిగ్ ఫైట్ జరుగనుంది. టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్ బౌలింగ్ తీసుకున్నాడు. ఐపీఎల్ ట్రోఫీని ఇదివరకే పట్టేసిన ఆర్సీబీ, గుజరాత్ మరోసారి ఛాంపియ 2022లో హార్దిక్ పాండ్యా సారథ్యంలో టైటిల్ అందుకున్న గుజరాత్‌ను ఈసారి శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో విజయంపై కన్నేసింది. 18వ సీజన్‌లో కప్ కొట్టిన ఆర్సీబీ.. ఈసాలా కప్ నమదే

చెలరేగాని గుజరాత్ భావిస్తోంది. విరాట్ కోహ్లీ, పడిక్కల్, పటిదార్, కృనాల్ పాండ్యా, టిమ్ డేవిడ్, జితేశ్ శర్మలతో బ్యాటింగ్ పరంగా ఆర్సీబీ మెరుగ్గా ఉంది. గుజరాత్ బౌలింగ్ యూనిట్ రబడ, సిరాజ్, హోల్డర్‌తో ప్రమాదకరంగా ఉంది. ర్లకు, ఆర్సీబీ బ్యాటర్లకు మధ్య తగ్గపోరు ఉండనుంది.

గుజరాత్ తుది జట్టు : సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), బట్లర్(వికెట్ కీపర్), సుందర్, రాహుల్ తెవాటియా, నిషాంత్ సింధు, హోల్డర్, రషీధ్ ఖాన్, సిరాజ్, రబడ, అర్షద్ ఖాన్.కృష్ణ, సాయి కిషోర్. ఇంప్యాక్ట్ సబ్స్ -- ప్రసిధ్ కృష్ణ, గ్లెన్ ఫిలిప్స్, అనుజ్ రావత్, కుమార్ కుషగ్ర, సాయి కిశోర్ ఆర్సీబీ తుది జట్టు .

## ఆసియా క్రీడల బెర్తులు ఖరారు.. మూడు పసికూనలకు అవకాశం..!




ఆసియా క్రీడల్లో పోటీపడే మహిళల క్రికెట్ జట్లు ఖరారయ్యాయి. భారత్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి మేటి జట్లతో చైనా, థాయ్‌లాండ్, మలేషియా తలపడే అవకాశాన్ని దక్కించుకున్నాయి. కౌలాలంపూర్ వేదికగా జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి మూడు బెర్తులను ఈ మూడు పట్టేశాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో మలేషియా, థాయ్‌లాండ్ ఫైనల్ చేరగా.. చైనా మూడో స్థానంతో ఆసియా క్రీడలకు అర్హత సాధించింది. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో మే 26 నుంచి మే 31 వరకూ ఆసియా క్రీడల క్రికెట్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ జరిగింది. గ్రూప్ ఏలో మలేషియా, హాంకాంగ్‌పై విజయాలతో థాయ్‌లాండ్ అగ్రస్థానం సాధించింది. గ్రూప్ బీలో ముందున్న నేపాల్.. సెమీఫైనల్లో మలేషియా చేతిలో ఓడింది. ఫైనల్లో తలపడిన మలేషియా, థాయ్‌లాండ్ జట్లకు నేరుగా ఆసియా క్రీడల బెర్తు దక్కింది. మూడో స్థానం కోసం చైనా, నేపాల్ పోటీపడగా.. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఐదు వికెట్లతో గెలుపొందిన చైనా అర్హత సాధించింది. ఈ ఏడాది సెప్టెంబర్ -- అక్టోబర్ మధ్యలో జపాన్‌లోని ఐచి ప్రిఫెక్చుర్, నగొయ ప్రాంతాల్లో ఆసియా క్రీడల క్రికెట్ పోటీలు జరుగనున్నాయి.

# వైభవ్ సూర్యవంశీకి గుజరాత్ బాడీ అటాక్ బౌలింగ్.. ఫిలిప్ హ్యూస్ గుర్తొచ్చాడని ఇర్ఫాన్ పఠాన్ ఎమోషనల్

ముల్లాన్‌పూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్ – రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ ఆట అందర్నీ ఆకట్టుకుంది. ఆ మా చ్‌లో సెంచరీని కోల్పోయిన వైభవ్.. క్రికెట్ ప్రే క్షకుల హృదయాలు గెలుచుకున్నాడు. అయితే ఈ మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్లు బాడీ అటాక్ బౌలింగ్ చేయడంపై ఇర్ఫాన్ పఠాన్ అభ్యం తరం వ్యక్తం చేశాడు. రబడా బౌలింగ్‌లో వైభవ్ తలకు బంతి తగలడంతో తనకు ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ ఫిలిప్ హ్యూసే గుర్తొచ్చాడని ఎమోషనల్ అయ్యాడు. ఐపీఎల్ 2026 క్వాలిఫయర్ 2లో వైభవ్ సూర్యవంశీ ఆటతీరుకు అందరూ ఫిదా అయ్యారు. కేవలం హిట్టింగే కాకుండా ఒక బాధ్యతాయుతమైన బ్యాటింగ్ చేసి జట్టును ఎలా ఆదుకోవాలో కూడా వైభవ్ సూర్యవంశీ నిరూపించాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీకి బాడీ అటాకింగ్ బౌలింగ్ చేయడంపై ఇర్ఫాన్ పఠాన్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. తాను చేసిన వ్యాఖ్యలను తాజాగా సమర్థించుకున్నాడు. 15 ఏళ్ల వైభవ్‌ను




అడ్డుకునేందుకు బాడీ అటాకింగ్ బౌలింగ్ చేయడం తనకు నచ్చలేదని చెప్పిన ఇర్ఫాన్ పఠాన్.. రబడా వేసిన బంతి వైభవ్ హెల్మెట్‌కి తాకడంతో ఫిలిప్ హ్యూస్ గుర్తొచ్చాడని ఎమోషనల్ అయ్యాడు. ఒక తండ్రిగా దానిని తాను సమర్థించలేకపోతున్నానంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ కూడా చేశాడు. "15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఆపేందుకు బాడీలైన్ బౌలింగ్ చేయడం నాకు కరెక్ట్ అనిపించలేదు. అతడు పెద్ద ఆటగాళ్లతో ఆడుతున్నాడని నాకూ తెలుసు. కానీ ఒక తండ్రిగా అది నాకు నచ్చలేదు. వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నా కొడుకు ఆడుతున్నట్లు అనిపిస్తోంది. అతడి తలకు బంతి తగలడంతో నాకు ఆందోళన కలిగింది. వెంటనే ఫిలిప్ హ్యూస్ గుర్తొచ్చాడు. వైభవ్ ఈ స్థాయిలో ఆడుతుంటే ఇలాంటి సవాళ్లే ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రత్యర్థి జట్టు అతడిపై వ్యూహాలు రచిస్తాయి. అందులో తప్పేమీ లేదు. కానీ ఒక తండ్రిగా నాకు అది నచ్చలేదు. వండర్ కిడ్ వైభవ్‌కి మంచే జరగాలని నేను కోరుకుంటున్నాను" అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు.

ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు ఫిలిప్ హ్యూస్ 2014లో దేశవాళీ మ్యాచ్ సందర్భంగా గ్రౌండ్‌లోనే కన్నుమూశాడు. సీన్ అబాట్ వేసిన బౌన్సర్ ఫిలిప్ హ్యూస్ తలకు తలగడంతో గ్రౌండ్‌లోనే కుప్పకూలాడు. హాస్పిటల్‌కు తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు.

# రాకా' నుంచి గ్లింప్స్ రాబోతుందా?.. అల్లు అర్జున్ మూడు షేడ్స్‌లో కనిపించబోతున్నాడా..!




'పుష్ప' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా 'రాకా' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. సినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా 'రాకా'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే 'రాకా' ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ-బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# క్యాన్సర్ అని తెలియగానే 'పెద్ది' సినిమా వదిలేద్దామనుకున్నా: శివరాజ్‌కుమార్ ఎమోషనల్




కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ తన క్యాన్సర్ పోరాటం గురించి రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ కోసం చెన్నై వెళ్లిన ఆయన తనకు క్యాన్సర్ వచ్చినప్పుడు ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవాలని అనుకున్నట్లు వెల్లడించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనకు కథ చెప్పిన రోజునే తాను రామ్ చరణ్‌తో కూడా మాట్లాడానని, అయితే ఆ తర్వాత 2024లో తనకు క్యాన్సర్ ఉన్నట్లు తేలిందని ఆయన గుర్తుచేసుకున్నారు. వైద్యం కోసం అమెరికా వెళ్లాల్సి రావడంతో సినిమాను క్యాన్సిల్ చేద్దామా అని మేకర్స్‌ను అడిగానని, కానీ దర్శకుడు బుచ్చిబాబు మరియు చిత్రబృందం తన స్థానంలో మరొకరిని రీప్లేస్ చేయడానికి అస్సలు ఒప్పుకోలేదని శివరాజ్‌కుమార్ తెలిపారు. తన కోసమే సినిమాను ఆపి, చాలా కాలం పాటు ఎదురుచూశారని, వారి చూపిన ప్రేమకు తాను ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని ఈ 64 ఏళ్ల నటుడు ఎమోషనల్ అయ్యారు. ఈ ఈవెంట్‌లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సైతం శివరాజ్‌కుమార్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. సినిమాలో శివరాజ్‌కుమార్ చేసిన గెస్ట్ అప్పీయరెన్స్ కోసమే తాను ఈ చిత్రాన్ని పలుమార్లు చూశానని చరణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా కారులో సిగరెట్ కాలుస్తూ వచ్చే స్లో-మోషన్ షాట్ ఒక ఐకానిక్ పర్ఫార్మెన్స్ అని, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ తెరపై ఒక నిప్పుకణంలా ఉంటుందని, ఆయన కళ్లే ఎన్నో భావాలను పలికిస్తాయని కొనియాడారు. 2024 డిసెంబర్‌లో అమెరికాలోని మయామిలో శివరాజ్‌కుమార్‌కు మూత్రాశయ క్యాన్సర్ సర్జరీ జరిగింది. ఆ సమయంలో తీవ్ర ఆంద ోళనకు గురైనప్పటికీ, అభిమానులు , కుటుంబ సభ్యుల మద్దతుతో కోలుకున్నట్లు ఆయన గతంలో తెలిపారు. క్యాన్సర్ కెమోథెరపీ చికిత్స తీసుకుంటూనే ఆయన తన కన్నడ చిత్రం '45' షూటింగ్‌లో కూడా పాల్గొనడం విశేషం. బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా మైత్రీ మూవీ మేకర్స్ మరియు కానుంది.

# ఏడేళ్ల ప్రేమకు పెళ్లి ముహూర్తం.. ప్రియాంక జైన్‌తో వివాహంపై క్లారిటీ ఇచ్చిన శివకుమార్



తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు ఎంతో పరిచయమైన జంటల్లో ప్రియాంక జైన్, శివకుమార్ ఒకరు. 'మౌనరాగం' సీరియల్ ద్వారా పరిచయమైన వీరిద్దరూ మొదట మంచి స్నేహితులుగా మారి, ఆ తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ప్రస్తుతం లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో కూడా కొనసాగుతోంది. వీరి ప్రేమ వ్యవహారం గురించి అభిమానులకు ఎప్పటి నుంచో తెలుసు. దీంతో సోషల్ మీడియాలోనూ, ఇంటర్వ్యూల్లోనూ వీరిద్దరికి తరచూ ఎదురయ్యే ప్రశ్న ఒక్కటే.. "పెళ్లి ఎప్పుడు?" అనే విషయం. తాజాగా ఈ ప్రశ్నకు శివకుమార్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తమ ప్రేమ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మాది ఏడేళ్ల ప్రేమ. మొదట ప్రియాంకే నాకు ప్రపోజ్ చేసింది. ఆమె ప్రపోజ్ చేసిన రెండు రోజుల తర్వాత నేను ఓకే చెప్పాను. అప్పటి నుంచి మా బంధం మరింత బలపడింది అని తెలిపారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌పై కూడా ఆయన స్పందించారు. మేము కలిసి ఉండటానికి ముందే మా కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్నాం. రెండు కుటుంబాలు కూడా మా నిర్ణయాన్ని గౌరవించాయి. వారి అంగీకారంతోనే మేము లివ్-ఇన్‌లో ఉన్నాం అని చెప్పారు. పెళ్లి విషయానికి వస్తే, ప్రస్తుతం ఇద్దరూ కలిసి ఒక ఇంటిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మా కలల ఇల్లు నిర్మాణంలో ఉంది. అది పూర్తయిన వెంటనే ఈ ఏడాదిలోనే పెళ్లి చేసుకుంటాం. పెళ్లి కోసం ఇప్పటికే కొన్ని ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నాం అని అన్నారు. తమ వివాహాన్ని ఉత్తరాఖండ్‌లోని ఓ పవిత్ర ఆలయంలో నిర్వహించాలని భావిస్తున్నట్లు శివకుమార్ తెలిపారు. యోగి నారాయణ్ ఆలయంలో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం. పురాణాల ప్రకారం శివపార్వతుల వివాహం కూడా అక్కడే జరిగినట్లు చెబుతారు. అందుకే ఆ ప్రదేశం మాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది అని వివరించారు. ఆలయంలో సాంప్రదాయబద్ధంగా వివాహం జరిగిన అనంతరం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే భవిష్యత్తులో నిర్మిస్తున్న ఇంట్లో రెండు కుటుంబాలు కలిసి ఉండేలా ప్రణాళికలు వేసుకున్నామని వెల్లడించారు. నేను నా కుటుంబంతో, ప్రియాంక తన కుటుంబంతో కాకుండా అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండాలని కోరుకుంటున్నాం. కుటుంబ బంధాలకు మేము ఎంతో విలువ ఇస్తాం అని శివకుమార్ తెలిపారు. ఇప్పటికే బుల్లితెరపై అభిమాన జంటగా గుర్తింపు పొందిన ప్రియాంక జైన్, శివకుమార్ త్వరలో నిజ జీవితంలోనూ చేస్తున్నారు.

# 'కరుప్పు' బ్లాక్‌బస్టర్.. సినిమాటోగ్రాఫర్ జీకే విష్ణుకు లగ్జరీ కారు గిఫ్ట్ ఇచ్చిన హీరో సూర్య



క్రేజీ సినిమాటోగ్రాఫర్ జీకే విష్ణు హీరో సూర్య ఒక ఖరీదైన లగ్జరీ కారును కానుకగా ఇచ్చి సర్ప్రైజ్ చేశారు. ఈ విషయాన్ని సినిమాటోగ్రాఫర్ జీకే విష్ణు స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ సూర్యకు కృతజ్ఞతలు తెలిపారు. సూర్య ఇచ్చిన కారు ఫోటోను షేర్ చేస్తూ.. "ఇదంతా దేవుడి దయ! థాంక్యూ సూర్య సార్. మీకు చాలా పెద్ద మనసు ఉంది" అంటూ తన ఆనందాన్ని వ్యక్తపరిచారు. గతంలో 'మెర్సల్', 'బిగిల్', 'జవాన్' వంటి భారీ చిత్రాలకు కెమెరామెన్‌గా పనిచేసిన జీకే విష్ణు, ఇప్పుడు 'కరుప్పు' చిత్రానికి అందించిన విజువల్స్ పట్ల ప్రేక్షకులు మరియు సినీ వర్గాల నుండి ప్రశంసల వర్షం కురుస్తోంది. సినిమా ఘన విజయం సాధించినప్పుడు టాలెంటెడ్ టెక్నీషియన్లను

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్ల క్లబ్‌లో చేరి భారీ వసూళ్లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా సాధిస్తున్న అద్భుతమైన విజయంతో చిత్రబృందం ఎంతో సంతోషంలో ఉంది. ఈ నేపథ్యంలో, సినిమాకు అద్భుతమైన విజువల్స్ అందించిన

# సర్టిఫికేట్ సినిమాను పిల్లలు చూస్తున్నారు.. హాలీవుడ్ సినిమాపై బాలీవుడ్ దర్శకుడు సంజయ్ గుప్తా ఆవేదన





కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో మొదటిరోజే వరల్డ్ వైడ్‌గా రూ.950 కోట్ల వసూళ్లను సాధించి హాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతున్న 'అబ్సెషన్'చిత్రంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్ గుప్తా. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి 'ఎ' సర్టిఫికేట్ పొందిన హాలీవుడ్ హర్రర్ చిత్రం 'అబ్సెషన్ ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ చిత్రాన్ని చూడటానికి మైనర్ పిల్లలు ( 18 ఏండ్ల కంటే తక్కువ) భారీ సంఖ్యలో థియేటర్లకు వస్తున్నారని సంజయ్ గుప్తా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల విడుదలైన ఒక మలయాళ సినిమాను చూసేందుకు తాను థియేటర్‌కు వెళ్లానని, ఆ స్క్రీన్‌లో కేవలం తాను ఒక్కడినే ఉన్నానని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. అయితే అదే థియేటర్‌లోని పక్క స్క్రీన్‌లో ప్రదర్శితమవుతున్న 'అబ్సెషన్' సినిమాకు తన కుమారుడు వెళ్లాడని, అక్కడ థియేటర్ మొత్తం పిల్లలతో నిండిపోయిందని ఆయన తెలిపారు. వారిలో చాలా మంది 18 ఏండ్ల కంటే తక్కువ వయసు వారే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఒక సంచలనంగా మారిందని, అయితే 'ఎ' రేటింగ్ ఉన్నప్పటికీ మైనర్లు ఎలా లోపలికి ప్రవేశిస్తున్నారనే దానిపై నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'అబ్సెషన్' చిత్రం తీవ్రమైన హింస మరియు అడల్ట్ కంటెంట్ కారణంగా సెన్సార్ బోర్డ్ నుంచి దాదాపు 38 సెకన్ల కీలక సీన్ల కత్తెరకు గురైనప్పటికీ, సినిమాపై ఉన్న క్రేజ్ కారణంగా ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో థియేటర్ల యాజమాన్యాలు నిబంధనలను సరిగ్గా అమలు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# శింబు టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమా?.. తెలుగు డెబ్యూపై మళ్లీ జోరందుకున్న చర్చ



కోలీవుడ్ స్టార్ హీరో శింబుకు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమాన వర్గం ఉంది. ఆయన నటించిన అనేక తమిళ చిత్రాలు తెలుగులో డబ్బింగ్ అయి మంచి విజయాలు సాధించడంతో టాలీవుడ్‌లో కూడా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే ఇంతటి క్రేజ్ ఉన్నప్పటికీ శింబు ఇప్పటివరకు నేరుగా తెలుగు సినిమాలో నటించలేదు. దీంతో ఆయన టాలీవుడ్ ఎంట్రీ గురించి తరచూ వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఈ అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని నెలలుగా శింబు ఓ ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థతో సినిమా చేయబోతున్నారనే ప్రచారం సాగుతోంది. గతంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో శింబు హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. మనసనమహా' షార్ట్ ఫిల్మ్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు దీపక్ రెడ్డి చెప్పిన కథ నిర్మాతలను ఆకట్టుకుందని, శింబు కూడా ఆ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆ తర్వాత ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పుడు తాజాగా మరో కొత్త కథతో శింబు ముందుకు వచ్చినట్లు సమాచారం. యువ దర్శకుడు కీర్తిశ్వరన్ చెప్పిన కథ ఆయనను బాగా ఆకట్టుకుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన 'డ్యూడ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తిశ్వరన్, కొత్త తరహా కథాంశంతో శింబును మెప్పించినట్లు తెలుస్తోంది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఇక శింబు కెరీర్ విషయానికి వస్తే, బాలనటుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన ఆయన 2002లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. ప్రేమకథలు, యాక్షన్ డ్రామాలు, మాస్ ఎంటర్‌టైనర్‌లతో తమిళ ప్రేక్షకులను అలరిస్తూ స్టార్ హీరోగా ఎదిగారు. ఒక దశలో తెలుగులో కూడా ఆయన సినిమాలకు మంచి మార్కెట్ ఏర్పడింది. అయితే వరుస పరాజయాలు, వ్యక్తిగత వివాదాల కారణంగా కొంతకాలం కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తిరిగి వరుస విజయాలతో బలంగా కమ్‌బ్యాక్ ఇచ్చిన తీసుకెళ్తున్నారు.

# 'కృష్ణమ్మ' ఓటీటీ రిలీజ్‌పై సత్యదేవ్ ఆవేదన.. నాకే తెలియకుండా సినిమా స్ట్రీమింగ్ అయిపోయింది



తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం థియేట్రికల్ రిలీజ్‌ల తర్వాత ఓటీటీ విడుదలల వ్యవహారం పెద్ద చర్చగా మారుతోంది. ఈ నేపథ్యంలో హీరో సత్యదేవ్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. తన కెరీర్‌లో అత్యంత ఇష్టమైన చిత్రాల్లో ఒకటైన 'కృష్ణమ్మ' సినిమా థియేటర్లలో విడుదలైన కేవలం ఆరు రోజులకే ఓటీటీలోకి వచ్చేసిందని, ఆ విషయం తనకు కూడా ముందుగా తెలియదని సత్యదేవ్ వెల్లడించడం సంచలనంగా మారింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సత్యదేవ్ 'కృష్ణమ్మ' సినిమా విడుదల సమయంలో జరిగిన పరిణామాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తం చేసిన ఆవేదన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తున్న సమయంలోనే సినిమా ఓటీటీలోకి రావడం తనకు తీవ్ర నిరాశ కలిగించిందని చెప్పారు. సత్యదేవ్ మాట్లాడుతూ, ""కృష్ణమ్మ' పెద్ద స్థాయిలో ఆడాల్సిన సినిమా. దర్శకుడు కొరటాల శివ సమర్పించిన ఈ చిత్రంపై మాకు మంచి నమ్మకం ఉంది. కానీ సినిమా శుక్రవారం విడుదలై, తర్వాతి గురువారానికే ఓటీటీలోకి వచ్చేసింది. ఆ నిర్ణయం గురించి నాకు ఎలాంటి సమాచారం లేదు. నిర్మాతలు, ఇతర భాగస్వాములు తమ మధ్య మాట్లాడుకుని నిర్ణయం తీసుకున్నారు.

నా కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మెన్స్‌లలో ఇది ఒకటి. కానీ చాలా తక్కువ మంది మాత్రమే థియేటర్లలో చూసే అవకాశం దక్కింది" అని తెలిపారు. అంతేకాకుండా సినిమా విడుదల సమయంలో ఎదురైన పరిస్థితులను కూడా ఆయన గుర్తు చేసుకున్నారు.

సినిమాకు రోజురోజుకు కలెక్షన్లు పెరుగుతున్నాయి.

ప్రేక్షకుల నుంచి మంచి టాక్ వచ్చింది. కానీ అదే సమయంలో ఎన్నికల హడావిడి, తీవ్రమైన ఎండలు ప్రభావం చూపించాయి. ఎన్నికల కారణంగా ఒక రోజు, కర్ఫ్యూ పరిస్థితుల కారణంగా మరో రోజు ప్రభావితమయ్యాయి. అలాంటి సమయంలో సినిమా ఓటీటీలోకి వచ్చేయడం బాధ కలిగించింది అని అన్నారు.

# లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి 'జయం రవి'.. 'బెంజ్' నుంచి క్రేజీ అప్‌డేట్!



స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ సృష్టించిన క్రేజీ ఫ్రాంచైజీ 'లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్' (ఎల్‌సీయూ) లోకి మరో ప్రముఖ నటుడు అధికారికంగా అడుగుపెట్టారు. రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బెంజ్' చిత్రంలోకి తమిళ నటుడు రవి మోహన్ (జయం రవి) చేరారు. ఈ విషయాన్ని డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ చిత్ర సెట్స్ నుండి కొన్ని ఫోటోలను పంచుకున్నారు. వెల్‌కమ్ టు ది యూనివర్స్ రవి మోహన్ సార్ అంటూ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. భాగ్యరాజ్ కణ్ణన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామాను లోకేశ్ కనగరాజ్ తన సొంత బ్యానర్ 'జీ స్క్వాడ్' పై ప్యాషన్ స్టూడియోస్, ది రూట్ సంస్థలతో కలిసి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి లోకేశ్ కనగరాజ్ స్వయంగా కథను అందించడం విశేషం. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' చిత్రాల తర్వాత లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సీయూ) లో వస్తున్న నాల్గవ చిత్రంగా 'బెంజ్' నిలవనుంది. అయితే లోకేశ్ దర్శకత్వం వహించకుండా కేవలం కథ అందించి నిర్మిస్తున్న మొదటి ఎల్‌సీయూ చిత్రం ఇదే కావడం గమనార్హం. ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో నివిన్ పాలీ 'ట్విన్ ఫిష్ వాల్టర్' అనే అత్యంత శక్తివంతమైన క్రూరమైన విలన్ పాత్రలో నటిస్తుండగా, సంయుక్త మీనన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రవి మోహన్ ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఎల్‌సీయూ లవర్స్‌కు సరికొత్త యాక్షన్ అనుభూతిని పంచనుంది.